

www.prajakalam.in
epaper.prajakalam.in

RNI NO.TELTEL/2010/33275

ప్రజా కలం

తెలుగు దినపత్రిక

Digital Editions
http://prajakalam.in
epaper.prajakalam.in
paperboy.com, www.magzter.com

ప్రజాకలం పాఠకులకు,
ప్రకటనదారులకు, అధికారులకు
రాజకీయనాయకులకు, కార్యకర్తలకు
సిబ్బందికి, మిత్రులకు, మా శ్రేయోభిలాషులకు

విజయదశమి
శుభాకాంక్షలు

- ప్రజాకలం టీం

మంగళవారం | 20-10- 2026 | సంపుటి: 17, | సంచిక : 199, | పేజీలు :12, | వెల : 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆





యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనుల్లో

వేగం పెంచండి

నిర్దేశిత గడువుకు 15 రోజుల ముందే పనులు పూర్తి చేయాలి



నవంబరు నెలాఖరులోగా సమ్మిట్ ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశం

ఇబ్రహీంపట్నంలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రారంభం..

ఎఫ్‌సీడీఏ ఆవరణలో ఎన్ఐయూఎం క్యాంపస్‌కు శంకుస్థాపన

హైదరాబాద్, అక్టోబర్ 19 (ప్రజాకలం)

తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' ఏర్పాట్లను అత్యున్నత ప్రమాణాలతో చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునేలా అంతర్జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహణ, వసతులు, మౌలిక సదుపాయాలు ఉండాలని స్పష్టం చేశారు. సోమవారం భారత్ ఫ్యూచర్ సిటీలో పర్యటించిన ముఖ్యమంత్రి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించి, సమ్మిట్ ఏర్పాట్లపై అధికారులకు కీలక సూచనలు చేశారు.

నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి:

భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' జరగనున్న నేపథ్యంలో నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సీఎం సూచించారు. యూనివర్సిటీ నిర్మాణాన్ని వీలైనంత

తరువాయి 2వ పేజీలో...

ఆర్థిక సంస్కరణలు, రుణాల పునర్వ్యవస్థీకరణపై

ప్రత్యేక దృష్టి

నిధుల వినియోగ పురోగతిపై శాఖల వారీగా సమీక్షించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్, అక్టోబర్ 19 (ప్రజాకలం)

ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి బడ్జెట్‌లో కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించడానికి వేగం పెంచాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. కేటాయింపులకు అనుగుణంగా నిధుల వ్యయాన్ని వేగవంతం చేయడంతోపాటు, నిధుల వినియోగంలో వెనుకబడిన శాఖలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మరోవైపు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ఆర్థిక శాఖలో సంస్కరణలు, ఆదాయ వనరుల సమీకరణ, రుణాల పునర్వ్యవస్థీకరణపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భట్టి విక్రమార్క ఎస్సీ, ఎస్టీ ప్రోగ్రెస్ సబ్‌ప్లాన్ అమలు, శాఖల వారీగా బడ్జెట్ కేటాయింపులు, ఇప్పటివరకు జరిగిన వ్యయం, రాష్ట్ర ఆర్థిక నిర్వహణకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. కేటాయించిన నిధులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఖర్చయ్యేలా సంబంధిత శాఖలు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, సామాజిక, ఆర్థిక సాధికారత కోసం కేటాయించిన నిధుల

తరువాయి 2వ పేజీలో...

కాంగ్రెస్ నేతలకు

లీగల్ నోటీసులు



హైదరాబాద్, అక్టోబర్ 19 (ప్రజాకలం)

కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు కొండపోచమ్మ సాగర్ నీటిని మళ్లించారన్న ఆరోపణలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త వివాదానికి తెరలేపాయి. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ లీగల్ నోటీసులు జారీ చేసింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ వంశీకృష్ణ గడ్డం ఈ నోటీసులు అందుకున్న వారిలో ఉన్నారు. ఆరోపణలకు సంబంధించి సోషల్ మీడియా పోస్టులను వెంటనే తొలగించి, బహిరంగంగా చేసిన ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, లీగల్ సెల్ ఇన్‌చార్జ్ సోమ భరత్ కుమార్ ఈ నోటీసులు జారీ చేసినట్లు పార్టీ వెల్లడించింది. కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు నుంచి మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు చెందిన ఫామ్‌హౌస్‌కు నీటిని

తరువాయి 2వ పేజీలో...



అర్హులందరికీ

ఇందిరమ్మ ఇండ్లు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాల అమలు ఆగదు

- కూసుమంచి క్యాంప్ ఆఫీస్ వద్ద కూసుమంచి మండల రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ చేసిన మంత్రి.



పాలేరు అక్టోబర్ 19(ప్రజా కలం న్యూస్)

రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

తరువాయి 2వ పేజీలో...

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనుల్లో

వేగం పెంచండి

ఆర్థిక సంస్కరణలు, రుణాల పునర్వ్యవస్థీకరణపై

ప్రత్యేక దృష్టి

మొదటి పేజీ తరువాయి...

త్వరగా పూర్తి చేసి, సమ్మిట్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువుకు 15 రోజుల ముందుగానే పనులు పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

నవంబరు నెలాఖరులోగా ఏర్పాట్లు పూర్తి:

గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను నవంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యంగా బహిరంగ ప్రాంగణానికి సంబంధించిన పనులను నవంబరు 15వ తేదీలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమ్మిట్ ఏర్పాట్ల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనులు జరిగేలా చూడాలని చెప్పారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ఎలాంటి జాప్యానికి తావులేకుండా ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పెట్టుబడులకు భరోసా.. తెలంగాణకు కొత్త దిశ:

'మీ పెట్టుబడులకు మాది భరోసా' అనే నినాదంతో నిర్వహించనున్న ఈ గ్లోబల్ సమ్మిట్ కేవలం వ్యాపార సమావేశానికే పరిమితం కాకుండా, తెలంగాణ రాజకీయ, ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే చారిత్రక వేదికగా నిలవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం, నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రూపొందుతున్న మౌలిక సదుపాయాలను ప్రపంచ పారిశ్రామికవేత్తలకు పరిచయం చేసేలా సదస్సును నిర్వహించాలన్నారు. అంతర్జాతీయ ప్రతినిధులకు తెలంగాణ అభివృద్ధి ప్రస్థానాన్ని చాటిచెప్పే విధంగా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. సమ్మిట్ విజయవంతం కావడానికి ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని అధికారులకు స్పష్టం చేశారు.

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రారంభం:

భారత్ ఫ్యూచర్ సిటీలో పర్యటించడానికి ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇబ్రహీంపట్నంలో నూతనంగా నిర్మించిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ను ప్రారంభించారు. అనంతరం కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయాన్ని ప్రారంభించి, పోలీస్ కమిషనర్ తరుణ్ జోషికి శుభాకాంక్షలు తెలిపారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణ, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పోలీసు వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఈ కమిషనరేట్ కీలకంగా నిలవనుంది.

ఎన్ఐయూఎం క్యాంపస్‌కు శంకుస్థాపన:

అనంతరం భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని సందర్శించిన ముఖ్యమంత్రి, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ ఆవరణలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐయూఎం) క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన క్యాంపస్ నమూనాను పరిశీలించి, నిర్మాణానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఫ్యూచర్ సిటీని ఆధునిక పట్టణ ప్రణాళిక, సమర్థవంతమైన నిర్వహణ, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడులకు అనుకూలమైన కేంద్రంగా అభివృద్ధి చేసే క్రమంలో ఈ ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఉందని అధికారుల పర్యటన స్పష్టం చేసింది.

పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల హాజరు:

ఈ కార్యక్రమాల్లో శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, ప్రకాశ్ గౌడ్, కాలె యాదయ్య, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.

డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు, యూనివర్సిటీ నిర్మాణం, పోలీస్ కమిషనరేట్ ప్రారంభం, ఎన్ఐయూఎం క్యాంపస్ శంకుస్థాపనతో భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

మొదటి పేజీ తరువాయి...

వినియోగంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులు ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధికి సమర్థవంతంగా ఉపయోగపడేలా శాఖలవారీగా వ్యయ ప్రణాళికలను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. చట్ట నిబంధనలు, బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా సాధారణ పద్దుల తరహాలోనే ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక పద్దుల కింద కేటాయించిన నిధులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆదేశించారు. నిధుల ఖర్చులో ఉన్న అంతరాలను గుర్తించి, వాటిని అధిగమించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

నిధుల వినియోగంలో వెనుకబడిన శాఖలతో ఆర్థిక శాఖ అధికారులు ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహించి, ఖర్చుల పురోగతిని వేగవంతం చేయాలని సూచించారు. ఈ మేరకు ముందుగా ఖర్చులో ఎక్కువ గ్యాప్ ఉన్న మొదటి ఐదు శాఖలు వ్యవసాయం, వైద్యం, ఇంధనం, పురపాలక, పంచాయతీరాజ్, సాంఘిక సంక్షేమం, పరిశ్రమలు, గిరిజన సంక్షేమ, తరువాత క్రమంలో ఇతర శాఖల కార్యదర్శులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేయాలన్నారు.

ఆయా శాఖలకు కేటాయించిన నిధులు, ఇప్పటివరకు జరిగిన వ్యయం, మిగిలిన నిధుల వినియోగానికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించి, నివేదిక రూపొందించాలని సూచించారు.

ఆర్థిక సంస్కరణలతో ఆదాయ వనరుల పెంపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేసేందుకు అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవడంతోపాటు, అదనపు ఆదాయ మార్గాలను గుర్తించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. బడ్జెట్ రూపకల్పనలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటూ, వ్యయ నియంత్రణ, నిధుల సద్వినియోగం, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక వనరుల లభ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ఆర్థిక శాఖలో అమలు చేస్తున్న సంస్కరణలు, ప్రభుత్వ ఆదాయ వనరుల సమీకరణకు చేపడుతున్న చర్యలు, రుణాల పునర్వ్యవస్థీకరణపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ఆర్థిక నిర్వహణ దీర్ఘకాలిక ప్రయోజనాలకు అనుగుణంగా ఉండేలా పటిష్టమైన ప్రణాళికలు రూపొందించాలని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు.

నిపుణుల సలహాలతో మెరుగైన ఆర్థిక నిర్వహణ

ఆర్థిక నిర్వహణలో అత్యుత్తమ ప్రమాణాలను పాటించేందుకు అనుభవజ్ఞులైన కన్సల్టెంట్లు, ఆర్థిక రంగ నిపుణుల సేవలను వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు.

నిపుణుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. బడ్జెట్ కేటాయింపులు, నిధుల వ్యయం, అభివృద్ధి కార్యక్రమాల అమలు మధ్య సమన్వయం ఉండేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు. సంక్షేమానికి కేటాయించిన నిధులు అర్హులైన వర్గాలకు ప్రయోజనం చేకూర్చేలా వినియోగం కావడంతోపాటు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం, అభివృద్ధి లక్ష్యాల సాధనకు సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణ అవసరమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఫైనాన్స్, ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఫైనాన్స్ స్పెషల్ సెక్రటరీ సిక్తా పట్నాయక్‌తో పాటు ఇతర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలకు లీగల్ నోటీసులు

మొదటి పేజీ తరువాయి...

మల్లించారంటూ కాంగ్రెస్ నేతలు చేసిన ఆరోపణలు ఆయన ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయని నోటీసుల్లో పేర్కొన్నట్లు సమాచారం. నంబంధిత పోస్టులను బేషరతుగా తొలగించడంతో పాటు ఆరోపణలను ఉపసంహరించుకోవాలని కోరింది. నోటీసులకు స్పందించకపోతే పరువు నష్టం దావాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

ఈ వివాదం కేవలం కాంగ్రెస్ నేతలకే పరిమితం కాలేదు. ఇదే అంశంపై వార్త ప్రచురించిన ప్రముఖ తెలుగు దినపత్రిక యాజమాన్యం, ఎడిటర్‌కు కూడా బీఆర్ఎస్ ఒక రోజు ముందే లీగల్ నోటీసు పంపింది. అక్టోబర్ 17న మొదటి పేజీలో ప్రచురితమైన కథనాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని పార్టీ డిమాండ్ చేసింది. ఆ వార్త రాజకీయ ప్రేరేపితమైందని, కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీయడంతో పాటు గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన నీటిపారుదల ప్రాజెక్టులపై ప్రజల్లో అపోహలు కలిగించే ఉద్దేశంతో ప్రచురించారని పార్టీ ఆరోపించింది.

యాదాద్రి భువనగిరి జిల్లా సాగునీటి అవసరాలు, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు, దాని కాలువల వ్యవస్థను కేసీఆర్ వ్యవసాయ భూములతో అనుసంధానిస్తూ కథనం రాయడానికి ఎలాంటి ఆధారాలు ఉపయోగించారని బీఆర్ఎస్ ప్రశ్నించింది. నీటిపారుదల శాఖ అధికారిక రికార్డులను పరిశీలించారా? కాలువల వాస్తవ మార్గాలను ధృవీకరించారా? సంబంధిత అధికారుల వివరణ తీసుకున్నారా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరింది. ఈ వివరాలు నిర్ధారించకుండా సంచలనాత్మక శీర్షికలతో ఆరోపణలను ప్రచురించడం జర్నలిజం ప్రమాణాలకు విరుద్ధమని విమర్శించింది.

కేసీఆర్ పేరును ప్రస్తావిస్తూ వివాదాలు సృష్టించడం, బీఆర్ఎస్‌ను రాజకీయంగా లక్ష్యంగా చేసుకోవడం, గత ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల ప్రతిష్ఠను దెబ్బతీయడం వంటి ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని పార్టీ పేర్కొంది. ప్రతీవం ఖీతీవవఽశీఏ ముసుగులో ఆధారాలు లేని ఆరోపణలకు మీడియా వేదికగా మారితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించింది. మరోవైపు, కాంగ్రెస్ నేతలపై జారీ చేసిన నోటీసులు, వాటికి వారు ఎలా స్పందిస్తారన్న అంశాలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారాయి. అయితే, ఫామ్‌హౌస్‌కు నీటిని మళ్లించారన్న ఆరోపణలపై తుది నిర్ధారణకు సంబంధిత అధికారిక రికార్డులు, ఆధారాలు పరిశీలించాల్సి ఉంటుంది.

చెన్నూర్ పట్టణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తాం

రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద



మంచిర్యాల జిల్లా

ప్రజాకలం జిల్లా ప్రతినిధి అక్టోబర్ 19, :

చెన్నూర్ పట్టణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో 15వ వార్డులో అభివృద్ధి పనులకు అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ చెన్నూర్ పట్టణంలో రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించడం అభినందనీయమని, ప్రజల సహకారంతోనే అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయగలమని తెలిపారు. డి.ఎం.ఎఫ్.టి. నిధుల ద్వారా 50 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, రోడ్డు విస్తరణలో భాగంగా దుకాణాలు కోల్పోయిన వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా 70 షావులను కేటాయించేందుకు చర్యలు చేపట్టాలని, స్లాట్‌ల వారీగా కేటాయింపు ప్రక్రియను నిర్వహించి 3, 4 నెలలలో పూర్తి చేయాలని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలను తగ్గించి, లారీల రాకపోకల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా బైపాస్ రహదారి నిర్మాణానికి 1 కోటి 60 లక్షల రూపాయలతో పనులు చేపట్టే అంశాన్ని పరిశీలించి, పట్టణాన్ని ఆధునికంగా తీర్చిదిద్దేందుకు రహదారులు, డ్రైనేజీలు, మార్కెట్లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గోదావరి పుష్కరాల సందర్భంగా అవసరమైన ఏర్పాట్లు, అభివృద్ధి పనుల కోసం 6 కోట్ల రూపాయలతో పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్‌లోని శివాలయ అభివృద్ధికి 17 కోట్ల రూపాయలతో పనులు చేపట్టే అంశాన్ని పరిశీలించడం జరుగుతుందని, పుష్కరాలకు వచ్చే భక్తులకు, స్థానిక ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పట్టణంలోని అన్ని వార్డులలో సి.సి. డ్రైనేజీల నిర్మాణం చేపట్టి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం 20 లక్షల రూపాయల నిధులు కేటాయించడం జరిగిందని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాన్‌వెజ్ మార్కెట్, ప్రజా మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ముదిరాజ్, మైనారిటీ, గౌడ తదితర వర్గాలకు అవసరమైన కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, సోమనపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు 200 కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం అల్పాహారం అందించే వంటకం అమలవుతుందని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, చదువుపై ఏకాగ్రత పెంపొందించేందుకు ఈ వంటకం దోహదపడుతుందని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత సమయంలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. పట్టణాన్ని ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు.

వట్టణంలోని 100 వడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి క్యాజువాలిటీ విభాగం, అత్యవసర వైద్య సేవల నిర్వహణ, రోగులకు అందిస్తున్న చికిత్స అంశాలను పరిశీలించి, సిబ్బంది హాజరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు, వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఆసుపత్రిలో రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సదుపాయాలు కల్పించాలని తెలిపారు. వైద్యులు సమన్వయంతో విధులు నిర్వహించాలని, ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన వైద్య పరికరాల వివరాలను తెలుసుకుని, వాటిని సమకూర్చేందుకు చర్యలు తీసుకోవాలని, అత్యవసర వైద్య సేవలకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్యం అందేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతతో పని చేయాలని, రోగులకు అవసర మైన వైద్య సదుపాయాలను మెరుగుపరుస్తూ, ఆసుపత్రి అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఆసుపత్రిలోని ఆర్.ఓ. ప్లాంట్‌ను పరిశీలించి, రోగులు, వారి సహాయకులకు శుద్ధి చేసిన త్రాగునీటిని అందించాలని, ఆసుపత్రి ప్రాంగణంలో పరిశుభ్రతను పాటిస్తూ, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు. పట్టణంలోని మధన పోచమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నూతన కమిటీ చైర్ పర్సన్ సతీష్, పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ మల్లికార్జున్, చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, చైర్‌పర్సన్ పెద్దింటి పద్మ, డి.సి.హెచ్.ఎస్. డా. కోటేశ్వర్ రావు, ఆనువత్రి వర్యవేక్షకులు డా. సత్యనారాయణ, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

మొదటి పేజీ తరువాయి...

సోమవారం మంత్రి, కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో కూసుమంచి మండలం ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నవరాత్రులలో అమ్మవారిని నిష్ఠతో పూజించి, మనసులోని కోరికలన్నీ విజయదసరి రోజున అమ్మవారు తీర్చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. గతంలో ఎన్నికల సమయంలో బొమ్మలు చూపించి, సినిమాటిక్‌గా ప్రకటనలు చేసి మోసం చేసిన ప్రభుత్వాలలా కాకుండా, అర్హులైన పేదవాడెవరూ నష్టపోకుండా ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి కల నెరవేర్చాలనేదే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.హౌ రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు, హైదరాబాదులో లక్ష ఇళ్లు మంజూరు చేయడమే కాకుండా, హైదరాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులు ప్రారంభించామని మంత్రి తెలిపారు. గ్రామీణ, తండా ప్రాంతాల్లో కూడా విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 30 వేల నుంచి 2 లక్షల 40 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. ఇప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి 40 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని, ఇంకా ఎంత ఖర్చయినా మూడో, నాలుగో విడతల్లో ఇళ్లు కట్టిస్తామని, అర్హులందరికీ అందజేస్తామని మంత్రి అన్నారు.కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుందని మంత్రి అన్నారు. ప్రతిపక్ష శాసనసభ్యుల నియోజకవర్గాల్లో కూడా పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామన్నారు.

సన్నబియ్యం, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ. 500 లు సన్నబియ్యానికి బోనస్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు భీమా అందిస్తున్నామని, మహిళలకు ఆర్థిక భద్రత కల్పిస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం ఇప్పటికే 73 వేల ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని, మరో 14,000 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చామని, త్వరలో మరిన్ని ఇవ్వబోతున్నామని తెలిపారు.

గత 33 నెలల్లోనే కేవలం మహిళా సంఘాలకు రూ. 73 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు అందించామన్నారు. పేదవాడి కష్టం తెలిసిన మన ప్రభుత్వం, పేదవాడి ముఖంలో ఆనందం చూడటమే లక్ష్యంగా పనిచేస్తోందని స్పష్టం చేస్తూ, రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పీ. శ్రీనివాస రెడ్డి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, కూసుమంచి మండల ఎంపీడీవో జశ్వంత్ కుమార్, తహశీల్దార్ సైదులు, హౌజింగ్ డీఈ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

త్రాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నీటిని పొదుపుగా వాడుకోవాలి - ఈర్లపూడి చెరువును పరిశీలించిన మంత్రి



ఖమ్మం, అక్టోబర్ 19(ప్రజా కలం న్యూస్)

నీటిని పొదుపుగా, జాగ్రత్తగా వాడుకోవాలని, తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంత్రి సోమవారం రఘునాథపాలెం మండలం ఈర్లపూడి చెరువును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నాగార్జున సాగర్ జలాల ఆధారంగా, మంచుకొండ లిఫ్ట్ ద్వారా నీటిని విడుదల చేసి ఈర్లపూడి చెరువును నింపడం జరిగిందని తెలిపారు.హౌప్రస్తుతం ఎల్నినో ప్రభావం తీవ్రంగా ఉన్నందున, రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందన్నారు. అలాగే సమీప కాలంలో వర్షాలు పడే సూచనలు తక్కువగా ఉన్నందున నీటిని ఎంతో జాగ్రత్తగా, పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చెరువులోని నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ వాడుకోవాలని సూచించారు.రైతులు నీటి అవసరం చాలా తక్కువతో సాగయ్యే ఆరుతడి పంటలు సాగు చేయాలని, వరి, మొక్కజొన్న లాంటి పంటలు సాగుచేయవద్దని సూచించారు. ఎల్నినో ప్రభావంతో వర్షాలు పడకపోవడంతో పాటు, ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలు ఉన్నాయని, నీరు, కరంట్ కొరత ఏర్పడే ప్రమాదం ఉందని మంత్రి అన్నారు. ప్రజలకు, పశు పక్ష్యాదులకు త్రాగునీరు ఎంతో ముఖ్యమని, నీటిని, కరంట్ ను పొదుపుగా వాడుకోవాలని మంత్రి తెలిపారు. ఈ పర్యటనలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, అధికారులు, తదితరులు ఉన్నారు.

నాగులమ్మ ఆలయంలో వైభవంగా కుంకుమార్చనలు

గ్రామం సుభిక్షంగా ఉండాలని పదేళ్లుగా ప్రత్యేక పూజలు



టేక్మాల్, అక్టోబర్ 19 (ప్రజా కలం ప్రతినిధి)

గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ టేక్మాల్‌లోని నాగులమ్మ ఆలయంలో దసరా నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. నాగులమ్మ ఆలయ కమిటీ సభ్యులు గత పదేళ్లుగా ఏటా నవరాత్రుల సమయంలో ఈ పూజా కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలుస్తూ గ్రామ ప్రజలంతా పూజల్లో పాల్గొని దర్శించుకుంటున్నారు. ఈ సందర్భంగా బీజేపీ మెదక్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పట్లోళ్ల మల్లిక అశోక్ దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. నవరాత్రుల సందర్భంగా ఆలయంలో భక్తులు నిష్ఠతో, నిబద్ధతతో అమ్మవారిని పూజిస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.ఈ కార్యక్రమంలో మేఘన, భారతి, స్వప్న, ఉమ, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.





విజయదశమి అందరికీ

విజయాలు చేకూర్చాలి

జిల్లా ప్రజలకు ఎస్పీ అశోక్ కుమార్ దసరా శుభాకాంక్షలు

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధ, వాహన పూజలు



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 19 (ప్రజా కలం)

విజయదశమి పండుగ జిల్లా ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అన్ని రంగాల్లో విజయాలు చేకూర్చాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆకాంక్షించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఆర్మ్ రిజర్వ్ విభాగంలో ఆయుధ పూజలు, పోలీసు వాహనాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలతో పాటు పోలీస్ అధికారులు, సిబ్బందికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఐపీఎస్, డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రవికుమార్, ఇన్‌స్పెక్టర్లు వేణు, ఆరిఫ్ అలీ ఖాన్, కరుణాకర్, శ్రీనివాస్, శ్రీధర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దసరా వేడుకలకు మెట్‌పల్లి సిద్ధం

నేడే విజయదశమి.. కనువిందు చేయనున్న మహిషాసుర మర్దనం - వేలాదిగా తరలిరానున్న భక్తులు.. పండుగకు సర్వం సిద్ధం

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి
అక్టోబర్ 19(ప్రజాకలం)

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగను ఘనంగా జరుపుకునేందుకు మెట్‌పల్లి పట్టణం సిద్ధమైంది. పట్టణవ్యాప్తంగా దసరా సందడి నెలకొంది. నవరాత్రుల సందర్భంగా పది రోజుల పాటు వివిధ అమ్మవారి మండపాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా, విజయదశమి సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోనున్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించే మహిషాసుర మర్దనం కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది.

శక్తి ఆరాధనకు ప్రతీక విజయదశమి

హిందువుల ప్రధాన పండుగల్లో విజయదశమికి విశిష్ట స్థానం ఉంది. దుర్గాదేవి మహిషాసురుడనే రాక్షసుడిని సంహరించి విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ పండుగను జరుపుకుంటారు. అలాగే శ్రీరాముడు రావణుడిపై విజయం సాధించిన రోజుగా కూడా విజయదశమికి ప్రాధాన్యత ఉంది. పాండవులు అజ్ఞాతవాసానికి ముందు జమ్మిచెట్టుపై దాచిన ఆయుధాలను తిరిగి తీసుకున్న సందర్భాన్ని స్మరించుకుంటూ జమ్మి ఆకులకు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

దేవీ నవరాత్రుల్లో భాగంగా అమ్మవారిని తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో పూజిస్తారు. దుర్గాదేవి, లక్ష్మీదేవి, సరస్వతీదేవిలను ఆరాధిస్తూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తెలంగాణలో బతుకమ్మ పండుగ కూడా నవరాత్రుల వేడుకల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ సంబరాలు నిర్వహిస్తారు. విజయదశమి రోజున కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందంగా పండుగను జరుపుకోవడంతోపాటు పెద్దల ఆశీస్సులు తీసుకుంటారు.

మహిషాసుర మర్దనం.. ప్రధాన ఆకర్షణ

పురాణాల ప్రకారం మహిషాసురుడు బ్రహ్మదేవుని కోసం ఘోర తపస్సు చేసి, పురుషుల చేతిలో మరణం సంభవించకూడదనే వరాన్ని పొందాడు. ఆ వరగర్వంతో దేవతలను ఓడించి ఇంద్రపదవిని సైతం ఆక్రమించాడు. దీంతో దేవతలంతా త్రిమూర్తులను ఆశ్రయించగా, వారి తేజస్సుల సమాహారంగా దుర్గాదేవి అవతరించినట్లు పురాణగాథలు చెబుతున్నాయి. సర్వదేవతలు అందించిన ఆయుధాలను ధరించి, సింహవాహనంపై మహిషాసురుడితో దుర్గాదేవి భీకర యుద్ధం చేసింది. అనేక రూపాలు ధరించి పోరాడిన మహిషాసురుడిని చివరకు అమ్మవారు సంహరించింది. ఈ విజయానికి గుర్తుగా విజయదశమి పర్వదినాన్ని జరుపుకుంటారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ఈ గాథ ప్రతీకగా నిలుస్తోంది.

మెట్‌పల్లిలో వైభవంగా వేడుకలు

మెట్‌పల్లి పట్టణంలో దసరా వేడుకలను ప్రజలు ఏటా ఘనంగా నిర్వహిస్తారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో జరిగే మహిషాసుర మర్దనం కార్యక్రమాన్ని వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. మహిషాసుర మర్దనాన్ని తిలకించిన అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి విజయదశమి సంబరాల్లో పాల్గొంటారు. కొత్త దుస్తులు ధరించడం, పెద్దలకు జమ్మి ఆకులు అందించి ఆశీస్సులు తీసుకోవడం, బంధుమిత్రులను కలుసుకోవడం వంటి సంప్రదాయాలతో పండుగకు మరింత ప్రత్యేకత చేకూరుతుంది. బాణసంచా కాలుస్తూ యువత, చిన్నారులు సంబరాలు చేసుకుంటారు. భక్తి, సంప్రదాయం, విజయోత్సాహాల కలయికగా నిలిచే విజయదశమి వేడుకలతో మెట్‌పల్లి పట్టణం పండుగ శోభను సంతరించుకోనుంది.



త్రిశక్తి దేవాలయంలో పూజలందుకుంటున్న అమ్మవార్లు

పట్టణ ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు, మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి మెట్ పల్లి

దసరా పండుగ సందర్భంగా పట్టణ ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా దసరా పండుగ సుఖసంతోషాలు జరుపుకుని ఆనందించాలనిహో కోరుతున్నాము. టపాసులు బాణాసంచాలు పేల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు భక్తి శ్రద్ధలతో దసరా పండుగ జరుపుకోవాలి.



వెటర్నరీ డాక్టర్ ఆమోదంతోనే మాంసం విక్రయించాలి

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు - మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్

మెట్‌పల్లిటౌన్ ప్రతినిధి అక్టోబర్ 19 (ప్రజాకలం): పట్టణంలోని మాంసం విక్రయదారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మెట్‌పల్లి మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. వెటర్నరీ డాక్టర్ ఆమోదం లేకుండా గొర్రెలు, మేకలను వధించి మాంసం విక్రయిస్తున్నారని, చనిపోయిన జంతువుల మాంసాన్ని కూడా విక్రయిస్తున్న వినియోగదారులను మోసం చేస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదులపై అధికారులు స్పందించారు. మెట్‌పల్లిలోని ఇందిరానగర్‌కు చెందిన బత్తుల మురళి జూన్ 3న సమర్పించిన దరఖాస్తుతో పాటు, ఈ నెల 17న రెవెన్యూ డివిజనల్ అధికారి పంపిన లేఖను పరిశీలించిన అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ ఈ చర్యలు చేపట్టారు.





ప్రజా కలం
ఆదివారం, అక్టోబర్ 18, 2026

సంస్కృతిని నిలుపుదాం.. మానవత్వాన్ని పంచుదాం

విజయదశమి మన ప్రాచీన సంస్కృతిలోని సౌందర్యాన్ని, సంప్రదాయాల్లోని ఆత్మీయతను గుర్తుచేసే పర్వదినం. తరతరాలుగా మనకు అందిన ఆచారాల్లో కుటుంబాలను కలిపే అనుబంధం, సమాజాన్ని నడిపించే నీతి, ప్రకృతిని గౌరవించే దృక్పథం ఇమిడి ఉన్నాయి. ఈ వారసత్వాన్ని అర్థం చేసుకుని, ఆచరణతో భావితరాలకు అందించాలనే సంకల్పానికి దసరా శుభసందర్భం. మన సంప్రదాయాల్లో ప్రతి ఆచారానికీ మానవ సంబంధాలతో అనుబంధం ఉంది. పెద్దలకు నమస్కరించడంలో కృతజ్ఞత, అతిథిని ఆదరించడంలో ఆత్మీయత, పండుగ వంటలను పంచుకోవడంలో సహజీవన భావం కనిపిస్తాయి. వీటిని పిల్లలకు పరిచయం చేసేటప్పుడు వాటి అంతరార్థాన్నీ వివరించాలి. ఆశీర్వాదం తీసుకోవడంతోపాటు పెద్దల అవసరాలను పట్టించుకోవడం నేర్పాలి. పలకరింపులో ప్రేమ, ప్రవర్తనలో గౌరవం ఉన్నప్పుడే సంప్రదాయం సజీవంగా నిలుస్తుంది. వేగంగా మారుతున్న జీవనశైలిలో కుటుంబ సభ్యులు కలిసి గడిపే సమయం తగ్గుతోంది. పండుగలు ఆ దూరాన్ని తగ్గించే ఆత్మీయ వేదికలు కావాలి. ఇంటిల్లిపాదీ కలిసి ఏర్పాట్లు చేసుకోవడం, పూర్వీకుల జ్ఞాపకాలను పంచుకోవడం, కుటుంబ ఆచారాల వెనుక కథలను చెప్పుకోవడం అనుబంధాలను బలపరుస్తాయి. పిల్లలు తమ మూలాలను తెలుసుకుని, వాటితో ప్రేమపూర్వకమైన బంధాన్ని ఏర్పరచుకుంటారు. ఆ అనుభవమే సంస్కృతిపట్ల సహజమైన అభిమానాన్ని పెంచుతుంది. మన సాంస్కృతిక సంపదలో మాతృభాషకు విశిష్ట స్థానం ఉంది. తెలుగు పలకరింపుల్లోని ఆప్యాయత, పద్యాల్లోని నీతి, జానపద గీతాల్లోని జీవనానుభవం పిల్లలకు చేరాలి. పండుగ వేళ స్థానిక కళాకారులను ప్రోత్సహించడం, సంప్రదాయ హస్తకళలకు ఆదరణ కల్పించడం ద్వారా వారసత్వానికి జీవనాధారం అందించవచ్చు. కళను ఆస్వాదించడంతోపాటు కళాకారుడి శ్రమను గౌరవించడం కూడా సంస్కృతి పరిరక్షణలో భాగమే. ఈ విలువలన్నింటికీ మూలం మానవత్వం. పక్కింటివారు కష్టంలో ఉన్నప్పుడు తోడుగా నిలవడం, ఒంటరిగా ఉన్న వృద్ధుడిని పలకరించడం, అవసరంలో ఉన్న కుటుంబంతో పండుగ ఆనందాన్ని పంచుకోవడం మన సంప్రదాయాలకు సార్థకత చేకూరుస్తాయి. సహాయం అందించేటప్పుడు ఎదుటివారి ఆత్మగౌరవాన్ని కాపాడాలి. కులం, మతం, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ప్రతి మనిషినీ గౌరవించే విశాలత మన ప్రవర్తనలో కనిపించాలి. సంస్కృతిని నిలబెట్టడం అంటే దాని మానవీయ సారాన్ని కాపాడటం. కాలానికి అనుగుణంగా ఆచరణ మారవచ్చు; దయ, సత్యం, కృతజ్ఞత, పరస్పర గౌరవం వంటి విలువలు మనకు మార్గదర్శకాలుగా నిలవాలి. ప్రకృతికి హాని తగ్గిస్తూ పండుగ చేసుకోవడం, ఆహారాన్ని వృథా చేయకుండా పంచుకోవడం, శ్రమించే ప్రతి వ్యక్తినీ ఆదరించడం ద్వారా ఆ విలువలను నేటి జీవితానికి అన్వయించుకోవచ్చు. ఈ విజయదశమికి మన ఇంట్లో ఒక మంచి సంప్రదాయాన్ని మరింత బలపరుద్దాం. పిల్లలతో తెలుగులో మాట్లాడుదాం. పెద్దల అనుభవాలను వినుదాం. స్థానిక కళలకు అండగా నిలుద్దాం. అవసరంలో ఉన్నవారికి ఆత్మీయంగా చేయూతనిద్దాం. మన పూర్వీకులు అందించిన వారసత్వం మన చేతల్లో వికసించాలి. మన సంస్కృతికి చిరునామా మన జీవనవిధానం; దాని ఔన్నత్యానికి సాక్ష్యం మన మానవత్వం.

- సి.హెచ్. ప్రతాప్

రాజారాంపల్లి గ్రామంలో వ్యక్తి దారుణ హత్య

- మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ



ఎండపల్లి, అక్టోబర్ 19 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని రాజారాంపల్లి గ్రామం లో వ్యక్తి దారుణ హత్య ఫిర్యాదు అయినా బొంతు మల్లయ్య వయసు 42 సంవత్సరాలు సొంత గ్రామం సుద్దాల యాదాద్రి భువనగిరి జిల్లా ప్రస్తుతం ధర్మారం గ్రామం లో నివాసం ఉంటున్నాడు శివరాత్రి మల్లేష్ అతని భార్యకు మధ్య ఉన్న అక్రమ సంబంధం వలన వారి ఇరు కుటుంబాలకు గత కొద్ది రోజుల నుంచి గొడవలకు జరుగుతున్నవి, ఈ క్రమంలో నిన్న అర్ధరాత్రి 12 గంటల 15 నిమిషాలకు ఫిర్యాది కొడుకు బొంతు సంతోష్ వయసు 17 సంవత్సరాలు అను అతన్ని శివరాత్రి మల్లేష్ మరియు అతని కొడుకు అయినా శివరాత్రి అనిల్ కుమార్ వయసు 21 సంవత్సరాలు అను ఇద్దరు వారికి ఉన్న పాత గొడవల ను మనసులో పెట్టుకొని మృతుడు సంతోష్ రాజారాంపల్లి గ్రామంలోని పాతగూడూర్ చౌరస్తా వద్ద ఉండగా అనిల్ కుమార్ తన తండ్రి మల్లేష్ యొక్క ప్రోత్సాహం తో సంతోష్ పై కత్తితో దాడి చేసి పలుచోట్ల తీవ్రంగా పొడవగా మృతుడు సంతోష్ కు తీవ్రమైన కత్తిపోట్ల అయ్యి రక్తస్రావం కాగా అతన్ని అంబులెన్స్ ద్వారా కరీంనగర్ ప్రభుత్వ హాస్పిటల్ కు షిఫ్ట్ చేయగా అక్కడ డాక్టర్ పరిశీలించి అప్పటికే చనిపోయినట్లుగా తెలిపినారు ఇట్టి సంఘటన పై ఫిర్యాదు అయిన మృతుని తండ్రి బొంతు మల్లయ్య ఫిర్యాదు మేరకు వెల్గటూర్ ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ కేసు నమోదు చేయగా, ధర్మపురి సిఐ ఎలపాటి రామ్ నరసింహారెడ్డి కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ తెలిపారు.

తైవాన్‌లో ఘనంగా తైవాన్ తెలుగు అసోసియేషన్

రెండవ బతుకమ్మ వేడుకలు

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి

- బతుకమ్మ పాటలు, నృత్యాలతో సందడిగా వేడుకలు



ఐనవోలు అక్టోబర్ 18: (ప్రజాకలం ప్రతినిధి)

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వండుగను తైవాన్‌లో ఘనంగా నిర్వహించారు. తైవాన్ తెలుగు అసోసియేషన్ (టీటీఏ) ఆధ్వర్యంలో అక్టోబర్ 18న తైవాన్‌లోని నాంగాంగ్‌లో రెండవ బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తైవాన్‌లో నివసిస్తున్న తెలుగు కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయ బతుకమ్మ పాటలు, నృత్యాలతో సందడి చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను విదేశీ గడ్డపై నిర్వహించడం ద్వారా తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు, విదేశాల్లో నివసిస్తున్న తెలుగు వారందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు కుటుంబాల సభ్యులంతా కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. పండుగ వాతావరణంలో పరస్పరం ఆత్మీయతను పంచుకుంటూ తెలుగు సంస్కృతీ వైభవాన్ని చాటిచెప్పారు. మన సంస్కృతి – మన సంప్రదాయం – మన ఐక్యత అనే సందేశంతో తైవాన్‌లో తెలుగు సంస్కృతిని మరింత బలోపేతం చేసేందుకు తైవాన్ తెలుగు అసోసియేషన్ కృషి చేస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తైవాన్ తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు డా. మనోజ్ శ్రీరామోజు, ఉపాధ్యక్షులు శైలజ, రామకృష్ణ కిషోర్, ప్రధాన కార్యదర్శి సత్యం కామని, కోశాధికారి ఏడుకొండలు, నాగతేజ, రాజునాయక్, రఘు పుటికం, విజయ, చందు, నాగార్జున, హేమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. విదేశాల్లోనూ తెలుగు పండుగలను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ద్వారా భారతీయుల మధ్య ఐక్యత బలపడటంతో పాటు, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరిస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు.

కక్కిరాలపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రావుల రవికుమార్

22 ఏళ్ల పార్టీ ప్రస్థానానికి గుర్తింపు-ఎమ్మెల్యే నాగరాజు చేతుల మీదుగా బాధ్యతలు

అవరోధాలు ఎదురైనా పార్టీని వీడని నిబద్ధత-ప్రజా సమస్యలపై పోరాటమే గుర్తింపుగా గ్రామస్థుల హర్షం

ఐనవోలు, అక్టోబర్ 19 (ప్రజాకలం ప్రతినిధి):-

హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం కక్కిరాలపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రావుల రవికుమార్ నియమితులయ్యారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు. 2004లో కాంగ్రెస్ పార్టీలో చేరిన రవికుమార్, గత 22 ఏళ్లుగా పార్టీకి నిబద్ధతతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నేపథ్యంలో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది.



పార్టీని వీడని నిబద్ధతకు గుర్తింపు

కాంగ్రెస్ పార్టీలో చేరిన నాటి నుంచి ఎన్నో ఆటుపోట్లు, అవరోధాలు ఎదురైనా రవికుమార్ పార్టీని వీడకుండా కొనసాగారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పలుమార్లు పార్టీ మారాలంటూ ప్రలోభాలు ఎదురైనా వాటికి లొంగకుండా కాంగ్రెస్‌లోనే కొనసాగారని ఆయన అనుచరులు చెబుతున్నారు. పార్టీ పట్ల ఆయన చూపిన నిబద్ధతకు ప్రస్తుత నియామకం గుర్తింపుగా నిలుస్తోందని అభిప్రాయపడుతున్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

గత ప్రభుత్వ హయాంలో పదో వార్డు సభ్యుడిగా గెలుపొందిన రవికుమార్, గ్రామంలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఏకైక ప్రజాప్రతినిధిగా కొనసాగుతూ ప్రజల సమస్యలపై తన గళాన్ని వినిపించారు. అధికార పార్టీ నుంచి ఇబ్బందులు ఎదురైనప్పటికీ వెనుకడుగు వేయకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని స్థానికులు గుర్తుచేస్తున్నారు. గ్రామంలో అందరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ, అందరినీ కలుపుకొని ముందుకు సాగే స్వభావం కలిగిన రవికుమార్‌కు గ్రామ పార్టీ అధ్యక్ష పదవి దక్కడంపై కక్కిరాలపల్లి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ బలోపేతంతో పాటు గ్రామాభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన మరింత కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నారు.

బొంద్రేట్ గ్రామంలో ఘనంగా అమ్మసాబ్ జాతర: సందల్, జెండా ఊరేగింపు



తానూర్,అక్టోబర్ 19(ప్రజా కలం): మండలంలోని బొండ్రేట్ గ్రామంలో అమ్మసాబ్ జాతర వార్షికోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉర్సు ఉత్సవం వైభవంగా జరిగింది,భక్తులు భక్తిశ్రద్ధలతో సందల్, జెండా కార్యక్రమాలను చేపట్టారు, ఈ వేడుకల్లో షేక్ ఫయాజ్, షేక్ ఆశా బి లతో పాటు ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ సిందే రవీందర్ పాటిల్ హాజరయ్యారు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు,ఈ ఉత్సవంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది..

కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడికి ఆర్థిక చేయూత

- ఇరవైవేలు ఆర్థిక సహాయం అందజేసిన కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు బోంపెల్లి దేవెందర్ రావు

(వరంగల్ /పర్వతగిరి)అక్టోబర్ 19, ప్రజాకలం ప్రతినిది

వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలోని ఇటివల మరణించిన కాంగ్రెస్ యువజన నాయకులు పూల్లూరి దిలీప్ అనారోగ్యంతో మరణించగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు బోంపెల్లి దేవెందర్ రావు వారి కుటుంబానికి ఇరవై వేలు ఆర్థిక సాయం అందజేసి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం శ్రమించిన యువ నాయకుడి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి పార్టీ పరంగా భవిష్యత్తులోనూ తగిన అండదండలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన వెంట వచ్చిన స్థానిక కాంగ్రెస్ సినియర్ నాయకులు జాటోత్ శ్రీనివాస్ నాయక్, కార్యకర్తలు దిలీప్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ దుర్ఘటనతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయని, యువకుడైన దిలీప్ అకాల మరణం పార్టీకి తీరని లోటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరంగా అందవలసిన సంక్షేమ పథకాలను, ఇతర సహాయ సహకారాలను తక్షణమే ఇప్పించేలా సంబంధిత అధికారులతో మాట్లాడతామని నాయకులు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జూలపల్లి గంగాధర్ రావు, ఏనుగల్లు సర్పంచ్ పద్మ కుమార్ యాదవ్, మండల ఎస్టి సెల్ అధ్యక్షులు బానోత్ భాస్కర్, మాల్య తండా సర్పంచ్ శ్రీలత శ్రీనివాస్, సీనియర్ నాయకులు రతన్ రావు, భీలు నాయక్, వంగల రవీందర్, సర్వర్,చౌద రాఘవులు, ఏనుగల్లు గ్రామ శాఖ అధ్యక్షులు ఎర్రబెల్లి మధుకర్ రావు, పెద్దతండ అధ్యక్షులు మోహన్ నాయక్, వార్డు మేంబర్లు, కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వ్యవసాయ బావిలో దూకి మహిళా ఆత్మహత్య



ఎండపల్లి, అక్టోబర్ 19 : (ప్రజాకలం ప్రతినిధి) మండలంలోని గుల్లకోట గ్రామం లో వ్యవసాయ బావిలో దూకి మహిళ ఆత్మహత్య గుల్లకోట గ్రామానికి చెందిన బైరి వెంకటమ్మ భర్త హనుమయ్య వయస్సు 85 సంవత్సరాలు అను ఆమె ఒక సంవత్సరం నుంచి వృద్ధప్య సమస్యల తో బాధపడుతూ జీవితం పైన విరక్తి చెంది, వ్యవసాయ బావిలో దూకి మరణించిన దని, అతని కొడుకు బైరి శంకరయ్య ఇచ్చిన ఫిర్యాది మేరకు వెల్గటూర్ పోలీస్ వారు కేసు నమోదు చేసినారు, అట్టి కేసు దర్యాప్తు లో భాగంగా నేర స్థలాన్ని సందర్శించి, మృతురాలి శవం కు శవ పంచనామా నిర్వ హించినారు. ఆ తర్వాత మృతురాలి శవం కు పోస్ట్ మార్టం నిమ్మితం ప్రభుత్వ హసుపత్రి, జగిత్యాల కు తరలించి, తదనంతరం మృతురాలి అంత్యక్రియల నిమిత్తం శవం ను బంధువు లకు అప్పజేప్పినట్లు వెల్గటూర్ ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ తెలిపారు.

భవానీ దీక్షాధారులకు భిక్ష..

- మతసామరస్యానికి నిదర్శనం



మల్లాపూర్ (ప్రజాకలం ప్రతినిధి): మతాలు వేరైనా మానవత్వం ఒక్కటేనని చాటుతూ మొగిలిపేట గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు మెహబూబ్ భవానీ దీక్షాధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. భక్తితో దీక్ష చేపట్టిన భవానీ స్వాములకు భిక్ష అందించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. మత సామరస్యం, సోదరభావం వెల్లివిరిసేలా భవాని స్వాములకు బిక్ష ఏర్పాటు చేయడం పలువురిని ఆకట్టుకుంది.

ఎల్వి మహాలక్ష్మి ఆలయంలో చోరీ: వెండి ఆభరణాల అపహరణ



తానూర్, అక్టోబర్ 19(ప్రజా కలం) నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఎల్వి గ్రామంలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం రాత్రి దొంగతనం జరిగింది. గుర్తుతెలియని దుండగులు రాయితో గుడి తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. అమ్మవారికి చెందిన సుమారు 11 తులాల వెండి కిరీటం, 2 తులాల వెండి తీగలను ఎత్తుకెళ్లినట్లు స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న తానూర్ పోలీసులు క్లూస్ టీమ్‌తో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.

ఆడపడుచులందరికీ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు

మాజీ కౌన్సిలర్ మార్కంటి వరలక్ష్మి కనకయ్య ముదిరాజ్

గజ్వేల్:19 అక్టోబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ప్రజలకు,మహిళలకు, ఆడపడుచులందరికీ బతుకమ్మ,దసరా పండుగ శుభాకాంక్షలను మాజీ కౌన్సిలర్,బీఆర్ఎస్ నాయకురాలు మార్కంటి వరలక్ష్మి కనకయ్య ముదిరాజ్ తెలిపారు.తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలందరూ సంతోషంగా, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.తీరొక్క పూలను సేకరించి,వాటితో అందంగా బతుకమ్మను పేర్చి పూజించడం, నూతన వస్త్రాలు ధరించి మహిళలంతా కలిసి బతుకమ్మ ఆడటం తెలంగాణ ప్రత్యేకత అని పేర్కొన్నారు.బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు.గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించడంతో పాటు మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారని గుర్తుచేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో కరువు పరిస్థితులు తీవ్రంగా ఏర్పడ్డాయని ఆమె విమర్శించారు.మహిళలను కోటీశ్వరులను చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని,అయితే మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేయడం లేదని,హామీ ఇచ్చిన తులం బంగారం అందించలేదని, ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని ప్రకటించిన హామీని కూడా నెరవేర్చడం లేదని విమర్శించారు. ప్రజలకు,ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మార్కంటి వరలక్ష్మి కనకయ్య ముదిరాజ్ డిమాండ్ చేశారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ,వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.



దుబాయ్ బతుకమ్మ వేడుకల్లో ధర్మపురి అరవింద్,డా అభినవ్ భాస్కర్



హనుమకొండ అక్టోబర్ 19 ప్రజా కలం ప్రతినిధి

ఇండియన్ పీపుల్స్ ఫోరం, తెలంగాణ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ముఖ్య అతిథిగా నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్,GWMC 60వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్,బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎన్ఆర్ఐ సెల్ కో-కన్వీనర్ డా.దాస్యం అభినవ్ భాస్కర్ పాల్గొని ఈ సందర్భంగా అభినవ్ మాట్లాడుతూ ..తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను విదేశీ గడ్డపై ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందని,మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ వ్యాప్తంగా చాటుతున్న నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఐపీఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు రాకేష్ బొరా,జాతీయ ప్రధాన కార్యదర్శి రాజీవ్ రంజన్ సింగ్, జాతీయ సంయుక్త కార్యదర్శి కుంబల మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి



బెల్లంపల్లి, అక్టోబర్ 19, (ప్రజాకలం) ప్రతినిధి.... బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మత్తమారి సూరిబాబు సోదరుడు మత్తమారి చంద్రశేఖర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, సోమవారం వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే గడ్డ వినోద్.అనంతరం చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.అదేవిధంగా, ఉమా భవన్ హోటల్ యజమాని అరికెళ్ల దుర్గయ్య గుండెపోటుతో మృతి చెందగా, వారి స్వగృహానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఈ విజయదశమి ప్రతి ఒక్కరికీ విజయాలను అందించాలి

- జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 19(ప్రజా కలం) విజయదశమి (దసరా) పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రతి ఇంటా ఆనందోత్సాహాలను నింపాలని ఆకాంక్షించారు. దృఢమైన సంకల్పం, పట్టుదలతో ముందుకు సాగితే విజయం తప్పక సిద్ధిస్తుందనే స్ఫూర్తిని ఈ పండుగ అందిస్తుందని పేర్కొన్నారు. దుర్గాదేవి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో జీవించాలని, చేపట్టిన ప్రతి కార్యంలో విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, సానుకూలత, విజయాలను తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కోరినారు.

ప్రజావాణి కార్యక్రమం లో ఫిర్యాదుల స్వీకరణ

ఎండపల్లి, అక్టోబర్ 19 : (ప్రజా కలం ప్రతినిధి) మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ సోమవారం రోజున ప్రజావాణి (ఫిర్యాదుల స్వీకరణ) కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి దొండ కృపాకర్ ఆధ్వర్యం లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ ప్రజావాణి కార్యక్రమం లో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల సమస్యలకు సంబంధించిన 06 దర ఖాస్తులు స్వీకరించ బడ్డాయి. అధికారులు అర్జీలను పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదే శించారు. హాజరైన వివిధ శాఖల అధికారులు మొత్తం 07 మంది అధికారులు హాజరయ్యారు. మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి దొండ కృపాకర్, రెవెన్యూ శాఖ నుండి ఆర్ ఐ అన్వేష్, సీనియర్ సహాయం వంశీకృష్ణ, మండల వ్యవసాయ శాఖ అధికారి కామాల్ల మహేష్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ఎల్ఎస్ఏ కాజోద్దీన్, మండల విద్యా శాఖ నుండి సి ఆర్ పి జాడి రాజమణి, వైద్య శాఖ నుండి ఎంపీహెచ్ఏ ఎస్ శ్రీనివాస్, ఎస్ సి సంక్షేమ శాఖ నుండి వాచ్మెన్ బి కొమురయ్య, లు పాల్గొన్నారు. మండల ప్రజా పరిషత్-1 తహశీల్దార్ -01 ఇందిరమ్మ ఇల్లు-04 ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు సమ న్వయం తో పనిచేయాలని ఎంపీడీవో దొండ కృపాకర్ తెలిపారు.



బిఆర్ఎస్‌లో భారీగా చేరికలు

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



వెల్గటూర్, సెప్టెంబర్19, ప్రజా కలం, ప్రతినిధి: జగిత్యాల జిల్లా, వెల్గటూర్ మండలంలోని పాసిగామ, జగదేవ్ పేట గ్రామాలకు నంబందించిన కొందరు నాయకులు ఆదివారం బిఆర్ఎస్ లో పార్టీలో చేరారు. కాగా వారికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా ముందుకు దూసుకు వెళ్లిందని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలు ఎంతగానో లబ్ధిపొందారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి గోరంగా విఫలమయ్యామని తెలంగాణ ప్రజలు గుర్తించారని, రోజు రోజుకు బిఆర్ఎస్ పార్టీకి ప్రజలల్లో ఆదరణ పెరుగుతుందని పేర్కొన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలల్లో బిఆర్ఎస్ ఘన విజయం సాదిస్తుందనే ధీమాను వ్యక్తం చేశారు. కాగా బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో కంటెం పవన్ కళ్యాణ్, అత్తి వెంకయ్య, నలిమెల మల్లేష్, నలిమెల మహేష్, కంటెం హరీష్, కాండ్రపు హరీష్, కాండ్రపు రవి, కంటెం కమలాకర్, కంటెం సాయి సిద్ధార్థ్, వాసం రవి, వాసం అంజి, కోన రాకేష్, అత్తె నితిన్, ఎంబడి తిరుపతి, ఎంబడి శ్రీధర్, అత్తె మహేష్, కంటెం తిరుపతి, అల్లం రవి, అత్తె మల్లేష్, ఎంబడి రాజయ్య, ఎంబడి శ్రీను, ఎంబడి సంజీవ్, ఎంబడి సతీష్, గర్వాంధుల స్వామి, కంటెం అంజి, కంటెం సుధాకర్, కంటెం తిరుపతి, అత్తె శ్రీను, ఎంబడి దిలీప్, గోపతి మహేష్, కంటెం రాజయ్య, పందిగిరి సత్తయ్య, పందిగిరి రవి, వాసం అంజి, కంటెం అభిషేక్, కంటెం వంశి, కంటెం సందీప్, కాంపెల్లి దావీదు, అత్తె బాబులు, కంటెం పవన్, కంటెం వెంకటేష్, ఎంబడి వంశి, ఎంబడి మధు కృష్ణ, కోన మహేష్, కోన వినయ్, కోన వంశి, నలిమెల వంశి, కోన మహేందర్ , అల్లం మహేందర్, వాసం సతీష్, వాసం రమేష్, ఎంబడి తిరుపతి, వాసం నరేష్, పోగుల రాజేందర్, ఖ్యాతం జయాకర్, ఖ్యాతం అశోక్, సదారి చంద్రమౌళి లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లూరి రాంచందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్, వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్, నాయకులు మూగల సత్యం, కొప్పుల సురేష్, హనుమల తిరుపతి, రంగు తిరుపతి గౌడ్, మెరుగు అశోక్ గౌడ్, బండెల సతీష్, రంగు భూమయ్య, రాపాక సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

టీజీపీఎస్సీ పరీక్షలను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలి

- టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం- అక్టోబర్ 24న అసిస్టెంట్ సైంటిస్ట్, అక్టోబర్ 26న అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పరీక్షలు
- పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్‌కు అనుమతి లేదు - ప్రతి 24 మంది అభ్యర్థులకు ఒక కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ఇన్విజిలేటర్‌ను నియమించాలి
- విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర సరఫరా, అభ్యర్థులకు త్రాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించాలి - పరీక్షల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి
టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పరీక్షల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన టీజీఎస్పీసి చైర్మన్.

ఖమ్మం, అక్టోబరు 19 (ప్రజాకలం న్యూస్): ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో ఉద్యోగ నియామకాల కోసం ఈ నెల 24, 26 తేదీల్లో నిర్వహించనున్న పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో చిన్నపాటి పొరపాట్లకు కూడా తావులేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

పరీక్షల నిర్వహణకు సంబంధించి భద్రత, సిబ్బంది నియామకం, అభ్యర్థుల తనిఖీలు, సాంకేతిక సదుపాయాలు, నిరంతర విద్యుత్ సరఫరా తదితర అంశాలపై సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డి, అదనపు డీసీపీ రామానుజన్ పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాల భద్రతకు పటిష్ఠ చర్యలు

సుమారు ఏడాదిన్నర విరామం తర్వాత ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలు మళ్లీ ప్రాధాన్యం సంతరించుకున్నాయని బుర్రా వెంకటేశం తెలిపారు. ఇకపై వరుసగా పలు పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో ప్రతి పరీక్షను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికలను ఎంత పకడ్బందీగా నిర్వహిస్తామో, ఉద్యోగ నియామక పరీక్షలనూ అంతే బాధ్యతతో చేపట్టాలని సూచించారు.

ప్రశ్నపత్రాల లీకేజీకి అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. పరీక్షకు కొద్ది గంటల ముందు మాత్రమే ప్రశ్నపత్రాలను ఖరారు చేసే విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షల్లో అభ్యర్థులకు ప్రశ్నలు దశలవారీగా కనిపించేలా సాంకేతిక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ప్రశ్నపత్రాల భద్రత విషయంలో



ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు.

సెల్‌ఫోన్లపై కఠిన ఆంక్షలు

పరీక్షా కేంద్రాల్లో పోలీసు బందోబస్తు, అభ్యర్థుల తనిఖీలను పటిష్ఠంగా నిర్వహించాలని ఆదేశించారు. అభ్యర్థులతో పాటు విధుల్లో ఉండే సిబ్బంది, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు, తనిఖీలకు వచ్చే అధికారులు సైతం సెల్‌ఫోన్లు తీసుకురావద్దని స్పష్టం చేశారు. నిర్దేశిత నిబంధనల ప్రకారం చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే ఫోన్ వినియోగానికి అనుమతి ఉంటుందని, అది కూడా పర్యవేక్షణలోనే జరగాలని సూచించారు.

ప్రతి 24 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియమించాలని, వారికి కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో కంప్యూటర్లు, ఇతర సాంకేతిక పరికరాలు సక్రమంగా పనిచేసేలా ముందస్తు తనిఖీలు నిర్వహించాలన్నారు. పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అరగంట ముందే గేట్ల మూసివేత

ఈ నెల 24న అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్-II), 26న అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చైర్మన్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయన్నారు.

అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 9.30 గంటలు, మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ నిబంధనపై అభ్యర్థులకు పత్రికలు, ఇతర మాధ్యమాల ద్వారా ముందుగానే విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రస్తుతం బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నామని, రానున్న నెలల్లో ముఖ గుర్తింపు విధానాన్ని కూడా ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు.

మహిళా పోలీసులతో తనిఖీలు

పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థుల తనిఖీలకు తగిన సిబ్బందిని నియమించాలని సూచించారు. మహిళా అభ్యర్థుల తనిఖీల కోసం మహిళా పోలీసులను అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి నిషేధిత వస్తువులు వెళ్లకుండా ఫ్రిస్కింగ్ ప్రక్రియను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు.

అభ్యర్థులకు రవాణా సదుపాయాలతో పాటు తాగునీరు, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష సమయంలో అస్వస్థతకు గురైన వారికి కేంద్రంలోనే ప్రాథమిక చికిత్స అందించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరీక్ష పూర్తయ్యే వరకు అభ్యర్థులు కేంద్రం విడిచి వెళ్లకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలను అందరికీ సమానంగా అమలు చేయాలని, ఎలాంటి మినహాయింపులకు అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు.

పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ర్యాలీలు, ధర్నాలు, రాజకీయ, ప్రాంతీయ సభలకు అనుమతులు ఇవ్వకూడదని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. అభ్యర్థుల్లో టీజీపీఎస్సీపై నమ్మకం పెరిగేలా పరీక్షలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని పేర్కొన్నారు.

ఖమ్మంలో 7 పరీక్షా కేంద్రాలు

ఖమ్మం జిల్లాలో పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. జిల్లాలోని ఏడు కేంద్రాల్లో తొలి రోజు 1,554 మంది, రెండో రోజు 1,335 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వివరించారు. ప్రతి 24 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న సిబ్బందిని నియమించనున్నట్లు చెప్పారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశమై పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. చీఫ్ సూపరింటెండెంట్లను గుర్తించి, అవసరమైన సిబ్బందిని ముందుగానే నియమించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, సెల్‌ఫోన్ల నిబంధనలను కఠినంగా అమలు చేయాలని సూచించారు.

పరీక్ష ప్రారంభానికి గంట ముందుగానే అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవాలనే విషయాన్ని మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే గేట్లు మూసివేస్తారనే విషయాన్ని అభ్యర్థులకు తెలియజేయాలని చెప్పారు. తాగునీరు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచి, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో సీపీఓ ఏ. శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అందెల శ్రీరాములు పోరాటంతోనే

సోనీ కుటుంబానికి న్యాయం

- సోనీ కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సహాయం అందజేత




మహేశ్వరం, అక్టోబర్ 19 (ప్రజా కలం): మహేశ్వరం నియోజకవర్గం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నాదర్ గుల్ లోని ఎంవిఎస్ఆర్ కళాశాలలో ఇటీవల దాండియా నైట్ సందర్భంగా జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థిని సోనీ కుటుంబానికి న్యాయం జరిగింది. సోనీ కుటుంబానికి న్యాయం జరిగే వరకు మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ అందెల శ్రీరాములు, బీజేపీ యువ మోర్చా నాయకులు, ఇతర ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతి నిధులు కలిసికట్టుగా పోరాటం చేశారు. వారి నిరంతర పోరా టం ఫలితంగా కళాశాల యాజమాన్యం బాధిత సోనీ కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చింది. అలాగే ఈ ప్రమాదంలో గాయపడిన విద్యార్థినులకు అవసరమైన శస్త్రచికిత్సలు చేయిస్తామని హామీ ఇచ్చింది.ఈ మేరకు కళాశాల యాజమాన్యం మంజూరు చేసిన రూ.50 లక్షల చెక్కును సోనీ కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా నాయ కులు మాట్లాడుతూ, బాధిత కుటుం బానికి న్యాయం జరిగేలా, గాయపడిన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అం దేలా బాధ్యతాయుతంగా స్పందించి నప్పుడే ఇలాంటి ఘటనల్లో బాధితులకు అండగా నిలిచినట్లవు తుందని పేర్కొ న్నారు.ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్ యాదవ్, బడంగ్‌పేట్ డివిజన్ అధ్యక్షులు పవన్ కుమార్, కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, ఇంద్రసేన, మాజీ ఎంపీ టీసీ సభ్యులు ఏనుగు రామ్ రెడ్డి తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సుభాన్‌పూర్‌లో దుర్గామాత మండపాన్ని సందర్శించిన డీసీసీ అధ్యక్షురాలు పారిజాత నర్సింహారెడ్డి

మహేశ్వరం, అక్టోబర్ 19 (ప్రజా కలం): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం సుభాన్‌పూర్ గ్రామంలో దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా వెలసిన దుర్గామాత మండపాన్ని రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లూరి రాజు, శివగంగ దేవాలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్, నాయకులు మల్లేష్, బొల్లు కుమార్ యాదవ్, పెంజర్ల యాదయ్య, మంత్రి బాలరాజు, వత్తుల నారాయణ, ఎర్ర నవీన్ కుమార్, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.











యంపీడీఓ ప్రజావాణికి 9 ఫిర్యాదులు



మెట్‌పల్లి:(కోరుట్ల)ప్రతినిధి అక్టోబర్ 19(ప్రజా కలం): మెట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 9 ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీవో మహేందర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా రెవెన్యూ శాఖకు 2, మున్సిపల్ శాఖకు 2, ఇరిగేషన్ శాఖకు 2, హౌసింగ్, ఎలక్ట్రికల్, హెల్త్ శాఖలకు ఒక్కొక్క ఫిర్యాదు అందినట్లు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన 14 మంది అధికారులు హాజరయ్యారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు.


వార్డు కార్మికులకు దసరా కానుకగా కొత్త బట్టలు పంపిణీ

మెట్ పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 19 (ప్రజా కలం): విజయదశమి పండుగను పురస్కరించుకుని 26వ వార్డు కౌన్సిలర్ బొడ్ల రమేష్ వార్డు కార్మికులకు కొత్త బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్మికులకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారంతా అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షుడు లంక శ్రీకాంత్‌తో పాటు వార్డు కార్మికులు పాల్గొన్నారు.



ఘనంగా దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు

మెట్ పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 19 (ప్రజాకలం):- మెట్ పల్లి పట్టణం వెల్లుల్ల రోడ్డులోని అభయహస్త హనుమాన్ మందిరం సమీపంలో హనుమాన్ నగర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నవరాత్రుల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా వివిధ రకాల ప్రసాదాల సమర్పణ, 108 ప్రసాదాల కార్యక్రమం, గోపూజ, కుమారి పూజ, పుష్పాభిషేకం, బెల్లంతో అభిషేకం, పంచామృతాభిషేకం, విశేష గాజుల అలంకరణ, దుర్గాహోమం, బోనాల సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. శివపార్వతుల కల్యాణం, సహస్ర దీపాలంకరణ సేవలు భక్తులను ఆకట్టుకున్నాయి. అలాగే వేద పారాయణాలు, దుర్గాసూక్త పఠనం, మహిళలచే లలితా సహస్రనామ పారాయణం, భక్తిగీతాలు, భజనలు, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. సరస్వతీ పూజ అనంతరం విద్యార్థులకు పెన్నులు, నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. ప్రతిరోజూ చిన్నారుల నృత్య ప్రదర్శనలు, బతుకమ్మ ఆటపాటల కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగాయి. ఈ ఉత్సవాల్లో హనుమాన్ నగర్ కమిటీ సభ్యులు, భవానీ దీక్ష స్వాములు, కాలనీ మహిళలు, చిన్నారులు, పెద్దలు కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.



ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ - ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య 16



జగిత్యాల ప్రతినిధిఅక్టోబర్ 19(ప్రజా కలం)ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం16 ఫిర్యాదులు, వినతులు అందాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు.ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె. వై ప్రసాద్, ఆర్డీవో లు మధు సూదన్, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.







అధర్మంపై ధర్మానిదే అంతిమ విజయం

- దసరా శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే జీఎంఆర్

- పటాన్‌చెరు అభివృద్ధి ప్రస్థానం కొనసాగాలి

- కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ శ్రేణులకు శుభాకాంక్షలు

పటాన్‌చెరు, అక్టోబరు 19 (ప్రజాకలం):

అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి (జీఎంఆర్) అన్నారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

ఎన్ని కష్టాలు ఎదురైనా, చెడు ఎంతటి శక్తిమంతమైనదైనా అంతిమ విజయం మంచికే దక్కుతుందనే నందేశాన్ని విజయదశమి అందిస్తుందని పేర్కొన్నారు. పండుగ ప్రతి ఒక్కరిలో నూతనోత్సాహాన్ని నింపి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు.

అభివృద్ధి ప్రస్థానం కొనసాగాలి

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పటాన్‌చెరు నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించిందని జీఎంఆర్ పేర్కొన్నారు.

ఈ అభివృద్ధి ప్రస్థానం నిరంతరం కొనసాగాలని, సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని, కుటుంబాల్లో ప్రేమానురాగాలు వెల్లివిరియాలని కోరుకున్నారు.

బీఆర్ఎస్ శ్రేణులకు శుభాకాంక్షలు

ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేకంగా విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజల ఆశయాలు నెరవేరాలని ఆకాంక్షిస్తూ, ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకోవాలని ఎమ్మెల్యే జీఎంఆర్ పిలుపునిచ్చారు.



దసరా వేళ కార్మికులకు కానుకలు

200 మందికి పైగా కార్మికులకు చీరలు, గొడుగులు, నగదు పంపిణీ చేసిన శాపురం నర్సింహారెడ్డి

పటాన్‌చేరు, అక్టోబర్ 19 (ప్రజా కలం) ప్రతినిధి

దసరా పండుగను పురస్కరించుకుని ముత్తంగి డివిజన్‌లో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు శాపురం నర్సింహారెడ్డి పారిశుధ్య కార్మికులకు అండగా నిలిచారు. డివిజన్ పరిధిలో 200 మందికి పైగా పారిశుధ్య కార్మికులకు, ఇతరులకు చీరలు, గొడుగులు, నగదు పంపిణీ చేసి పండుగ సంతోషాలను పంచారు. ఈ సందర్భంగా ముత్తంగి డివిజన్ ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. పండుగ వేళ కార్మికులకు కానుకలు అందజేయడం ద్వారా వారి కుటుంబాల్లో ఆనందాన్ని నింపారు. కార్మికుల సంక్షేమం, ప్రజల సంతోషమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు..



పూల పండుగతో భారతీనగర్ కళకళ..

- మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన సింధూ ఆదర్శ్ రెడ్డి..

- కాలనీల్లో పూల పండుగ సందడి.. విజేతలకు బహుమతులు..

పటాన్‌చెరు, అక్టోబర్ 19 (ప్రజా కలం) ప్రతినిధి

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక బతుకమ్మ వండుగ భారతీనగర్ డివిజన్‌లో అంబరాన్నంటింది. పటాన్‌చెరు బీఆర్ఎస్ ఇన్‌చార్జి వెన్నవరం ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ కాలనీల్లో నిర్వహించిన వేడుకల్లో మాజీ కార్పొరేటర్ వి. సింధూ ఆదర్శ్ రెడ్డి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. భారతీనగర్, ఎల్ఐజీ కాలనీ, బీడీఎల్ కాలనీ, బాంబే కాలనీ, అన్నమయ్య ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ సంప్రదాయ నృత్యాలతో ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ పండుగకు రాష్ట్రస్థాయిలో మరింత గుర్తింపు లభించిందని తెలిపారు. సింధూ ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, బతుకమ్మ మహిళల ఐక్యతకు, తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. వివిధ కాలనీల్లో అందంగా అలంకరించిన బతుకమ్మలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు జగన్నాధ్ రెడ్డి, భాస్కర్ ముదిరాజ్, సంపత్ గౌడ్, సురేందర్, చిన్న, రాకేష్ రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు..





దసరా కానుకగా మహిళా సిబ్బందికి పట్టుచీరలు

అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆయాలకు మాద్రి జైపాల్ ఆత్మీయ సత్కారం

ఎండీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ

పటాన్‌చెరు, అక్టోబరు 19 (ప్రజాకలం):

దసరా పండుగను పురస్కరించుకుని పటాన్‌చెరు మాజీ జడ్పీటీసీ మాద్రి జైపాల్ అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆయాలకు పట్టుచీరలు పంపిణీ చేశారు. ఎండీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఈసారి కూడా చేపట్టి మహిళా సిబ్బందిని ఆత్మీయంగా సత్కరించారు.

సేవలు అమూల్యం

ఈ సందర్భంగా మాద్రి జైపాల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆయాలు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. చిన్నారుల సంరక్షణ, ప్రాథమిక విద్య, పౌష్టికాహార పంపిణీలో అంగన్వాడీ టీచర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఏఎన్ఎంలు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైద్య సేవలు అందిస్తూ ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయాలు చిన్నారుల సంరక్షణలో ఎంతో ఓర్పుతో, అంకితభావంతో పనిచేస్తున్నారని ప్రశంసించారు.

సమాజానికి సేవలందించే మహిళా సిబ్బందిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, పండుగ వేళ వారి కుటుంబాల్లోనూ ఆనందం నింపాలనే ఉద్దేశంతో పట్టుచీరలు అందజేస్తున్నట్లు చెప్పారు.

పదవికి అతీతంగా ప్రజాసేవ

పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజలతో మమేకమవుతూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునే మాద్రి జైపాల్ చొరవపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సామాజిక సేవ పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు. మహిళా సిబ్బంది సేవలను గుర్తించి గౌరవించడం తమకు మరింత ప్రోత్సాహాన్నిస్తోందని వారు సంతోషం వ్యక్తం చేశారు.

ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

కార్యక్రమంలో ఎండీఆర్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొని మహిళా సిబ్బందికి స్వయంగా పట్టుచీరలు అందజేశారు. వారంతా కుటుంబ సభ్యులతో కలిసి దసరా పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. మహిళా సిబ్బంది సేవలను గౌరవిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు.





దసరా సందడి

- కొనుగోళ్లతో కిక్కిరిసిన గద్వాల మార్కెట్!





గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 19 (ప్రజా కలం):

విజయదశమి దసరా పండుగను పురస్కరించుకుని జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో సోమవారం మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పండుగకు అవసరమైన వస్తువుల కొనుగోళ్లతో ప్రధాన వీధుల్లో సందడి నెలకొంది. ముఖ్యంగా గుమ్మడికాయలు, బంతిపూలు, కొబ్బరికాయల దుకాణాల వద్ద ప్రజలు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. పూజా సామగ్రి, పండుగకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేసేందుకు మహిళలు, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో మార్కెట్ ప్రాంతాలు జనసందోహంతో కిక్కిరిసిపోయాయి. దసరా పండుగ నేపథ్యంలో వ్యాపారులకు గిరాకీ పెరగడంతో దుకాణాల వద్ద సందడి వాతావరణం కనిపించింది. పండుగ కొనుగోళ్లతో గద్వాల జిల్లా కేంద్రం అంతటా పండుగ కళ ఉట్టిపడింది.

ప్రతి ఫిర్యాదు దరఖాస్తును పరిశీలించి చర్యలు తీసుకోవాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ - ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్



ఖమ్మం, అక్టోబర్ 19(ప్రజా కలం న్యూస్)

ప్రతి ఫిర్యాదు దరఖాస్తును పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. రఘునాథ పాలెం మండలం బూడిదెంపాడు గ్రామానికి చెందిన కే సంపత్ కుమార్, తన భార్య బానోతు సోనాలీ పెనుబల్లి మండలం రామచంద్రరావు బంజర గ్రామానికి పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తూ జూన్ 9 2025న రోడ్డు ప్రమాదంలో మరణించారని, ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన పెన్షన్, ఇన్సూరెన్స్ డబ్బులు ఇంకా అందలేదని, తమ చెల్లింపులకు సంబంధించిన ఫైలు ఎంపీడీవో కార్యాలయం నుంచి పంపలేదని తెలిసిందని, తమకు కారుణ్య నియామకం కూడా ఇంకా కాలేదని తమ పరిస్థితిని అర్థం చేసుకొని ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు అదేవిధంగా కారుణ్య నియమాకం అయ్యే విధంగా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం నగరం బుర్హాన్ పురంకు చెందిన క్షత్రివాణి బాయి సర్వేనెంబర్ 4/అ/1/1/2 లో గల బోరుబావి మీటర్ తన తండ్రి పేరు మీద ఉందని ఆ భూమి తనకు రిజిస్ట్రేషన్ చేశారని తన తండ్రి మరణించారని, మీటర్ పేరు మార్చాలని అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ చర్యలు తీసుకోవడంలేదని, విద్యుత్ మీటర్ తన పేరుకు మార్చాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, సంబంధిత ఎన్పీడీసీఎల్ ఇంజనీరింగ్ అధికారికి రాస్తూ వెంటనే పరిశీలించిచర్యలు తీసుకోవాలని అదుపుకలెక్టర్ఆదేశించారు. రఘునాథ పాలెం మండలం వేపకుంట్ల గ్రామానికి చెందిన కృష్ణయ్య, తనకు గ్రామంలో 700 చదరపుగజముల స్థలం ఉందని, అందులో తన ఇద్దరు కుమారులు ఇండ్లు నిర్మించుకున్నారని, తన కుమారులు తనను చూడటం లేదని, తన సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ సీనియర్ సిటిజన్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు .ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో నీటి పొదుపుపై ప్రత్యేక దృష్టి

- తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే పంటలను సాగు చేయాలి

- జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు

నాగర్ కర్నూల్ అక్టోబర్ 19 (ప్రజాకలం) : ఎల్‌నినో ప్రభావం, మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని యాసంగి పంటల సాగులో నీటి పొదుపునకు రైతులు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. యశ్వంత్ రావు సూచించారు. అందుబాటులో ఉన్న సాగునీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటూ, తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే పంటలను సాగు చేయాలని ఆయన రైతులకు పిలుపునిచ్చారు. యాసంగి సీజన్‌లో నీటి అవసరాన్ని తగ్గించేందుకు పెసర, మినుములు, ఇతర పప్పుధాన్యాలు, ఆముదం, నువ్వులు వంటి పంటల సాగును ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. వానాకాలంలో వరి సాగు చేసిన రైతులు కోతల అనంతరం పొలాల్లో మిగిలిన తేమను వినియోగించుకుని పప్పుధాన్యాలు, స్వల్పకాలిక పంటలను సాగు చేసేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కాలువల ద్వారా సాగునీటి సరఫరా పరిమితంగా ఉండే ప్రాంతాల్లో నీటి లభ్యతను అంచనా వేసుకుని ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నీటి లభ్యతపై స్పష్టత లేకుండా వరి, మొక్కజొన్న వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలను సాగు చేయడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల వాతావరణ పరిస్థితులు, అందుబాటులో ఉన్న నీటి వనరులను పరిగణనలోకి తీసుకుని పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రైతులకు సరైన పంటల ఎంపికపై అవగాహన కల్పించేందుకు గ్రామసభలు, రైతు సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. జిల్లా, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు ఎప్పటికప్పుడు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. యశ్వంత్ రావు పేర్కొన్నారు. నీటి పొదుపు పాటిస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా యాసంగిలో సాగునీటి వినియోగాన్ని తగ్గించి, రైతులకు ప్రయోజనం చేకూర్చవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.



తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తాం

జనసేన తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ గడల శ్రీనివాసరావు -ఖమ్మంలో ఘనంగా జనసేన పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభం



ఖమ్మం, అక్టోబర్ 19 (ప్రజా కలం న్యూస్ ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామని, తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా జనసేనను నిలబెడతామని జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జనసేన అభ్యర్థి డాక్టర్ శ్రీ గడల శ్రీనివాసరావు స్పష్టం చేశారు. జనసేన పార్టీ ఖమ్మం జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవం వేడుక ఖమ్మం జిల్లా కేంద్రంలోని గట్టయ్య సెంటర్ ప్రాంతంలో జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జనసేన అభ్యర్థి డాక్టర్ శ్రీ గడల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం అత్యంత ఘనంగా జరిగింది. కార్యాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, సాంప్రదాయ పద్ధతిలో రిబ్బన్ కట్ చేసి కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో డాక్టర్ శ్రీ గడల శ్రీనివాసరావు చేతుల మీదుగా జనసేన జెండా ఆవిష్కరించారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయం పనిచేయనుందని డాక్టర్ శ్రీ గడల శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కోటి అప్పారావ్, దుంపటి శ్రీనివాస్, రాము యాదవ్, మిర్యాల రామకృష్ణ, మిరియాల జగన్ మోహన్, బండారు రామకృష్ణ, యాసంనేని అజయ్ కృష్ణ, గంగిశెట్టి వెంకటేశ్వర్లు, హసీనా, తాళ్లూరి డేవిడ్, ఆంగోతి శ్రీను, తుడుం ఉత్తం రాజ్ , సచ్చు ప్రవంతి కన్నా, శివరాత్రి రమణ కుమార్, సాయి కుమార్, గంజి ఉదయ్, మామిడి ఉదయ్, నాగరాజు, రాజేంద్రప్రసాద్, బద్రి, బాలరాజు, తుమ్మలపూడి గంగాధర్, కొమ్ము అచ్యుత్, హనుమంతు మౌనిక, దేవేందర్, వెంకన్న, హనుమంతు సాయి కృష్ణ, మద్ది సాయికుమార్, కొమ్ము లక్ష్మి, భరత్, ఆనంద్, రాకేష్, వంశీ, పుల్లారావు, దుర్గాప్రసాద్, నరేష్, హరి, శ్రీకాంత్, నిర్మల, విజయలక్ష్మి ఫయాజ్, బాణాల శ్రీకాంత్, రచ్చ నాగరాజు, జనసైనికులు, వీరమహిళలు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు...ఖమ్మంలో జనసేన పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. జనసేన నాయకులు గంగిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 20 మందికి పైగా కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ రామ్ తాళ్ళూరి మామగారు శ్రీ కోటి అప్పారావ్ జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జనసేన అభ్యర్థి డాక్టర్ శ్రీ గడల శ్రీనివాసరావు చేతుల మీదుగా పార్టీ కండువాలు కప్పి జనసేన పార్టీలోకి అహ్వానించారు. రాజేష్, శ్యామ్, మల్లయ్య, సందీప్, పుల్లారావు, సాయి, సుందర్, ఫరీద్, అరుణ్ కుమార్, ప్రసాద్, ఆనంద్, రవితేజ, బీమా, నరేష్, సందీప్, ప్రవీణ్, గణేష్, మోహన్, రంగా, ప్రభు దీవెన, ప్రమోద్ కుమార్, బాలు, మోహన్, వెంకట్, శంకర్, చంద్రశేఖర్, కిషన్ నాయక్, కృష్ణ చంద్ర, ఏడుకొండలు, సతీష్, లీలా, పద్మ వేణు, సాయి, శ్రావణ్, శ్రీనివాస్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గం

కల్లుగీత కార్పొరేషన్‌కు రూ.5 వేల కోట్ల నిధులు కేటాయించాలి

కేజీకేఎస్ 69వ ఆవిర్భావ దినోత్సవంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం కరుణాకర్ డిమాండ్

పాలేరు అక్టోబర్ 19 (ప్రజా కలం న్యూస్)

కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని కల్లుగీత కార్మిక సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం కరుణాకర్ అన్నారు. సోమవారం కూసుమంచి మండల కేంద్రంలో కేజీకేఎస్ 69వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘం మండల కార్యదర్శి మంద నాగేశ్వరరావు, పెద్ద గౌడ్ అర్వపల్లి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో ఆయన జెండాను ఆవిష్కరించారు. 1957 అక్టోబర్ 19న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గార్లలో ఏర్పడిన కల్లుగీత కార్మిక సంఘం అనేక పోరాటాలు నిర్వహించి విజయాలు సాధించిందని తెలిపారు. అయినప్పటికీ గీత కార్మికుల సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని, ప్రభుత్వాలు వారి సంక్షేమంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో కల్లుగీత కార్పొరేషన్‌కు రూ.5 వేల కోట్లు కేటాయించాలని, గీత కార్మికుల పింఛన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచాలని, ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచి పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు నిండిన గీత కార్మికులందరికీ ఎలాంటి షరతులు లేకుండా పింఛన్ మంజూరు చేయాలని కోరారు. నీరా, తాటి ఉత్పత్తుల పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, నందనవనం ప్రాజెక్టుకు నిధులు కేటాయించి ప్రారంభించాలని, నెక్లెస్ రోడ్డులో మూసివేసిన నీరా కేఫ్‌ను వెంటనే తెరవాలని అన్నారు. కల్లుగీత సొసైటీలను బలోపేతం చేసి క్రమం తప్పకుండా ఎన్నికలు నిర్వహించాలని, సభ్యులందరికీ ద్విచక్ర వాహనాలు అందించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సొసైటీలను పునరుద్ధరించి, గీత కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలాంటి షరతులు లేకుండా వర్తింపజేయాలని సూచించారు. కల్లులోని పోషకాలు, ఔషధ గుణాలపై ప్రభుత్వమే ప్రచారం చేయాలని, మద్యం దుకాణాల్లో 25 శాతం రిజర్వేషన్‌ను అమలు చేసి ఆ అవకాశాన్ని సొసైటీలకే కల్పించాలని డిమాండ్ చేశారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని, కల్లు దుకాణాలపై ఎక్సైజ్ దాడులను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బుల్లికొండ పాపయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి మల్ల వెంకటయ్య, మండల సహాయ కార్యదర్శి బోడపట్ల శ్రీను,అర్వపల్లి వెంకటేశ్వర్లు, అర్వపల్లివెంకన్న, ఆర్వపల్లి పెద్ద వెంకటేశ్వర్లు, అర్వపల్లి కృష్ణమూర్తి, మంద రాంబాబు, పరసగాని వీరబాబు, మంద నాగేశ్వరరావు, ఆర్వపల్లి పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



టి.జి.పి.ఎస్.సి ఆన్‌లైన్ సీబీఆర్‌టీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- టి జి.పి ఎస్.సి .చైర్మన్ బుర్ర వెంకటేశం



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 19:

ఈ నెల 24, 26 తేదీల్లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టి.జి.పి.ఎస్.సి) నిర్వహించే అసిస్టెంట్ సైంటిస్ట్ గ్రేడ్-II, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ (పొల్యూషన్ కంట్రోల్ బోర్డు) నియామక పరీక్షలను తొలిసారిగా ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (సి.బి.ఆర్.టి) విధానంలో నిర్వహిస్తున్నందున, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్ర వెంకటేశం జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో పరీక్షల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. జిల్లాల వారీగా చేపట్టిన ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశానికి మహబూబ్‌నగర్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజీపీఎస్సీ చైర్మన్ బుర్ర వెంకటేశం మాట్లాడుతూ, కంప్యూటర్ ఆధారిత నియామక పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలనుఅనుమతించరాదని, అక్రమాలకు తావులేకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి 24 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియమించి, సిబ్బందికి ముందస్తు శిక్షణ ఇవ్వాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరాతోపాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, ఆర్టీసీ రవాణా, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు స్వయంగా పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

పరీక్షల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి: అదనపు కలెక్టర్ హరిప్రియ

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ మాట్లాడుతూ, టీజీపీఎస్సీ నిర్వహించే ఆన్‌లైన్ సీబీఆర్‌టీ పరీక్షలను ఎలాంటి ఇబ్బందులు, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్‌లోని జయప్రకాష్ ఇంజినీరింగ్ కళాశాల, ఎం.ఎస్ ఏస్ ఇన్ఫోటెక్, ఫాతిమా విద్యాలయాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో అక్టోబర్ 24, 26 తేదీల్లో ఉదయం, సాయంత్రం రెండు సెషన్లలో మొత్తం 640 మంది అభ్యర్థులు కంప్యూటర్ ఆధారిత నియామక పరీక్షలకు హాజరుకానున్నట్లు వెల్లడించారు.

పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్ల నియామకాన్ని ముందుగానే చేపట్టాలని సూచించారు. అవసరమైన సిబ్బందిని పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలల నుంచి సమకూర్చుకోవాలని, సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమన్వయం చేసుకుని సిబ్బంది వివరాలను సేకరించాలని తెలిపారు. చివరి నిమిషంలో సిబ్బంది కొరత ఏర్పడకుండా అదనపు ఇన్విజిలేటర్లను ప్రత్యామ్నాయంగా సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో కంప్యూటర్లు, ఇంటర్నెట్ కనెక్టివిటీ, ఇతర సాంకేతిక సదుపాయాలను ముందుగానే తనిఖీ చేయాలని, పరీక్ష ప్రారంభానికి ముందే అన్ని వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. ఏవైనా లోపాలు గుర్తిస్తే వెంటనే సరిచేయాలని, పరీక్షల నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

అభ్యర్థులకు పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలీస్ అధికారులు పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. అభ్యర్థుల రాకపోకలకు అనుకూలంగా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపాలని తెలిపారు. అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించే ముందు క్షుణ్ణంగా తనిఖీ (ఫ్రిస్కింగ్) చేయాలని, మొబైల్ ఫోన్లు, అనుమతి లేని ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను లోపలికి తీసుకెళ్లకుండా చూడాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో ఏవైనా సమస్యలు తలెత్తితే చీఫ్ సూపరింటెండెంట్లు సమన్వయంతో వ్యవహరించి వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పరీక్ష ప్రారంభం నుంచి ముగింపు వరకు అభ్యర్థుల హాజరు, పరీక్షల నిర్వహణ, ముగింపు వివరాలతో కూడిన నివేదికలను ఎప్పటికప్పుడు సేకరించాలని తెలిపారు.

పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ హరిప్రియ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ. శ్రీనివాసులు, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు, పరీక్షా కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

సిర్పెలి 'హెచ్' గ్రామంలో అంగరంగ వైభవంగా 'సత్య కర్ర దుర్గామాత' పూజలు



తానూ ర్, అక్టోబర్ 19(ప్రజా కలం): నిర్మల్ జిల్లా కుబీర్ మండలం సిర్పెలి (హెచ్) గ్రామంలో 'సత్య కర్ర దుర్గామాత' ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఈ గ్రామంలో 2013 సంవత్సరం నుంచి ప్రతి ఏటా ఈ కర్ర దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్టించి నవరాత్రి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ప్రత్యేకమైన విగ్రహాన్ని కుబీర్‌కు చెందిన ప్రముఖ శిల్పకవి పర్వత్వార్ శంకర్ 21 రోజుల పాటు నియమ నిష్ఠలతో శ్రమించి రూపొందించారు. నాటి నుంచి గ్రామంలో ఈ విగ్రహాన్ని ప్రతిష్టించి, తొమ్మిది రోజుల పాటు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కోరిన కోరికలు తీర్చే అమ్మవారిగా ప్రసిద్ధి చెందడంతో, దర్శనం కోసం చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేషంగా తరలివస్తున్నారు. నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించి, భక్తిశ్రద్ధలతో ధూపదీప నైవేద్యాలు, మహా హారతి నిర్వహిస్తున్నారు.

ఉత్సవాల అనంతరం భద్రపరిచే విగ్రహం:

సాధారణంగా దేవి నవరాత్రుల ముగింపులో విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. కానీ, ఈ 'సత్య కర్ర దుర్గామాత' విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించిన అనంతరం నిమజ్జనం చేయకుండా సురక్షితంగా భద్రపరుస్తామని, మళ్లీ మరుసటి సంవత్సరం ఉత్సవాల కోసం ప్రతిష్టిస్తామని గ్రామస్తులు తెలిపారు.

పినపాకలో ఎమ్మెల్యే మట్టా రాగమయికి ఘన సన్మానం..



తల్లాడ అక్టోబర్ 19 (ప్రజా కలం న్యూస్): దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి తల్లాడ మండలంలోని పాత పినపాక గ్రామంలో సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ను స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ నిర్వాహకులు సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుర్రం శ్రీనివాసరావు, కోదండ రామాలయం ఆలయ కమిటీ చైర్మన్ నర్వనేని లక్ష్మణరావు ఆమెను శాలువాలతో సన్మానించి సత్కరించారు. తొలుత ఎమ్మెల్యే బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా మహిళలతో కలిసి కోలాటం ఆడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మారెడ్డి, ఉప సర్పంచ్ నర్వనేని స్వరూప రాణి, గుర్రం కవిత, వార్డు మెంబర్లు, స్థానిక నాయకులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

తల్లాడ బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే మట్టా రాగమయి సందడి!

- మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన సత్తుపల్లి ఎమ్మెల్యే

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక: మట్టా రాగమయి

తల్లాడ, అక్టోబర్ 19 ప్రజా కలం న్యూస్

తల్లాడ పట్టణం లోని మల్లారం రోడ్డులో గల బొడ్డు నరసింహులు ప్రాంగణంలో మాజీ సర్పంచ్ బొడ్డు శ్రీలత ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఆడబిడ్డల ఐక్యతకు, ఆత్మగౌరవానికి ప్రతిరూపమని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బతుకమ్మ పండుగను ఐకమత్యంతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో మహిళలు పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ సందడి చేయడంతో ప్రాంగణమంతా వండుగ శోభను సంతరించుకుంది. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మహిళలతో కలిసి వేడుకల్లో పాల్గొనడంతో సంబరాలు



మరింత ఉత్సాహంగా సాగాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బతుకమ్మ కమిటీ సభ్యులు మొక్క వెంకటలక్ష్మి, మొక్క శంకరీ,మొక్క సీత ప్రత్యేక చొరవ చూపారు. వారి సమన్వయంతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు బొడ్డు వెంకటేశ్వర్లు, పి. నాగేశ్వరావు (108), బొడ్డు రామ లక్ష్మణ్, బొడ్డు చిన్న నరసింహులు, ధూపాటి. శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు

గ్రామసభ తీర్మానం లేకుండా ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ ఎలా?

- పట్టాల పంపిణీ నిలిపివేయాలి

- టీడబ్ల్యుఎంఎఫ్ జిల్లా ఇంచార్జి గుండా ఉపేందర్ రెడ్డి



పాలేరు అక్టోబర్ 19 (ప్రజాకలం న్యూస్): కూసుమంచి మండల కేంద్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీపై టీడబ్ల్యుఎంఎఫ్ జిల్లా ఇంచార్జి గుండా ఉపేందర్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ తీర్మానం, గ్రామసభ నిర్వహణ లేకుండా పట్టాల పంపిణీ చేపట్టడం నరైన వద్ధతి కాదని విమర్శించారు. వార్డు నభ్యులకు సైతం సమాచారం ఇవ్వకుండా పంపిణీ చేపట్టడాన్ని ఖండించారు. వెంటనే పట్టాల పంపిణీ నిలిపివేసి, పాలకమండలి తీర్మానం మరియు గ్రామసభ ద్వారా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు.

తల్లాడ మండల ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ ధూపాటి భద్రరాజు

ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలి



తల్లాడ,అక్టోబర్ 19 ప్రజా కలం న్యూస్ విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని తల్లాడ మండల ప్రజలకు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ధూపాటి భద్రరాజు దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు నింపాలని ఆకాంక్షించారు.
మండల ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి దసరా పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు. తల్లాడ మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, ప్రతి ఇంటా సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని కోరుకుంటూ మండల ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

వెట్టి చాకిరి నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి

- కార్మికుల హక్కులపై విస్తృత అవగాహన కల్పించాలి

- 'స్వేచ్ఛా రథం'ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ అక్టోబర్ 19 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

వెట్టి చాకిరి నిర్మూలనకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, కార్మికుల హక్కులు, చట్టాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు.
రాష్ట్రవ్యాప్తంగా వెట్టి చాకిరి నిర్మూలన, కార్మికుల హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెట్టి చాకిరి వల్ల కలిగే అనర్థాలు, దాని నిర్మూలనకు ఉన్న చట్టాలు, కార్మికులకు కల్పించిన హక్కులపై నాటికలు, పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించే ఈ ప్రచార రథం ద్వారా వ్యవసాయ రంగం, ఇటుక బట్టీలు, మైనింగ్, క్వారీలతో పాటు ఇతర రంగాల్లో పనిచేసే అసంఘటిత కార్మికులకు తమ హక్కులపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వెట్టి చాకిరికి గురైన వారు, అలాంటి ఘటనలను గుర్తించిన వారు వెంటనే ఫిర్యాదు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 080-69434343ను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.
అనంతరం వెట్టి చాకిరి నిర్మూలనకు సంబంధించిన గోడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెట్టి చాకిరి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, కార్మిక శాఖ అధికారి రాజలింగం, ప్రచార రథం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురం ముత్యాలమ్మ ఆలయం వద్ద మహా అన్నదానం

ప్రారంభించిన ఆలయ నిర్వాహకులు వెదురు కృష్ణారెడ్డి



తల్లాడ అక్టోబర్ 19 ప్రజా కలం న్యూస్ తల్లాడ పట్టణంలోని వైరా రోడ్డులోని నారాయణపురం గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ దేవాలయం వద్ద సోమవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దసరా పర్వదినం సందర్భంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపును పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహకులు వెదురు కృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ముగింపు సందర్భంగా ప్రజలకు ఈ మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అమ్మవారి దయవల్ల ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో ఉండాలని ఆకాంక్షించారు. సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మ భక్త బృందం మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఖమ్మం పోలీస్ కమిషనర్ కు దసరా శుభాకాంక్షలు తెలిపిన నారపోగు వెంకటేశ్వర్లు..



తల్లాడ అక్టోబర్ 19 ప్రజా కలం న్యూస్ ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ కు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఎస్సీ విభాగం వైస్ చైర్మన్, జిల్లా వాసి నారపోగు వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఖమ్మం సీపీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేక దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో సేవలందిస్తున్న సీపీని మర్యాదపూర్వకంగా కలిసినట్లు వెల్లడించారు. అనంతరం ఇరువురు కొద్దిసేపు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తీగల నాగరాజు ఉన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ అక్టోబర్ 19 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు.

అనంతరం జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్ ఆధ్వర్యంలో 'ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ సాచురేషన్ క్యాంపెయిన్' కు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 21వ తేదీ నుంచి నెలరోజు 'ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ సాచురేషన్ క్యాంపెయిన్' కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో నిర్వహించాలని తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణానికి ఈ నెల 21న శంకుస్థాపన



నిర్మల్ అక్టోబర్ 19 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ కొమురం భీం చౌరస్తా వద్ద నిర్మించనున్న నూతన అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణానికి ఈ నెల 21న శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఇంచార్జి అగ్నిమాపక అధికారి మామిడి భగవాన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేయనున్నారు. ఖానాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొననున్నారు.నూతన అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణంతో ఖానాపూర్ పరిసర ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు మరింత వేగంగా సేవలు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొనాలని జిల్లా అగ్నిమాపక అధికారి కోరారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ - ప్రజావాణికి 67 ఫిర్యాదుల స్వీకరణ



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 19: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ అధికారులకు ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ అర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జిదారుల సమస్యలను రెవెన్యూ అదనపు కలెక్టర్ సావధానంగా విన్నారు. ప్రతి సమస్యను జాగ్రత్తగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి భరోసా ఇచ్చారు. అధికారులు ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణిలో మున్సివల్, పంచాయతీరాజ్, మహిళా ,శిశు సంక్షేమం, పౌరసరఫరాల శాఖ, భూ సర్వే రికార్డులు, గృహ నిర్మాణం, గిరిజన అభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖ, విద్య, గ్రామీణ అభివృద్ధి, తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 67 వినతులను అధికారులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ ఎ.నిర్మల, డి.ఆర్.డి.ఓ నర్సింహులు,, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ చెక్ పోస్ట్ ను తనిఖీ చేసిన విజిలెన్స్ సభ్యులు..

తల్లాడ అక్టోబర్ 19 ప్రజా కలం న్యూస్

తల్లాడ వ్యవసాయ మార్కెట్ చెక్ పోస్ట్ ను వైరా వ్యవసాయ మార్కెట్ విజిలెన్స్ సభ్యులు నరేష్ కుమార్, వెంకటేశ్వర్లు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులైన ధాన్యం, పత్తి, మిర్చి మద్దతు ధరలను అనుసరించి మార్కెట్ ఫీజు వసూలు చేయాలని సూచించారు. మిర్చి పంటకు కూడా ప్రస్తుతం మార్కెట్లో నమోదవుతున్న ధరల ప్రకారం ఫీజు వసూలు చేయాలన్నారు. ఎవరైనా లైసెన్స్ లేకుండా వ్యాపారం చేపడితే మార్కెట్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం, పాషా ఉన్నారు.



పాలేరు నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు

పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి

పాలేరు, అక్టోబర్ 19 (ప్రజా కలం న్యూస్):

పాలేరు నియోజకవర్గ ప్రజలందరికీ పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి విజయదశమి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.దసరా పర్వదినాన్ని ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని, రైతులు, కార్మికులు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పాలేరు నియోజకవర్గ ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం, పరస్పర సహకారం మరింత పెంపొందాలని, ప్రతి కుటుంబం సుఖశాంతులతో వర్ధిల్లాలని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి ఆకాంక్షిస్తూ మరోసారి ప్రజలందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



నిర్మల్‌లో జేసీఐ నిర్మల్ స్ఫూర్తి ఇపిఎస్ వర్క్‌షాప్ విజయవంతం




తానూర్, అక్టోబర్ 19(ప్రజా కలం) జేసీఐ నిర్మల్ స్ఫూర్తి ఆధ్వర్యంలో నిర్మల్ ఉత్సవ్ బంకెట్ హాల్‌లో నిర్వహించిన రెండు రోజుల 'ఎఫెక్టివ్ పబ్లిక్ స్పీకింగ్' వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసింది. యువతలో వక్తృత్వం, నాయకత్వ లక్షణాలు పెంచేందుకు నిర్వహించిన ఈ శిక్షణకు ఎప్ప ముత్యం రెడ్డి, వెంకట రమణ రెడ్డి అతిథులుగా హాజరయ్యారు. రమేష్ దాడిగల, మహేందర్ గుండం శిక్షణ ఇచ్చారు. 40 మంది సభ్యులు, 10 మంది జూనియర్ జేసీలు పాల్గొన్న ఈ వర్క్‌షాప్‌లో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ విజయంపై ఫౌండర్ ప్రెసిడెంట్ వాడేకర్ లక్ష్మణ్ బృందానికి, సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.



విజయదశమి శుభవేళ

ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వేముల

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు19:



చెడుపై మంచి సాధించిన విజయానికి, అధర్మంపై ధర్మం గెలిచిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయదశమి పండుగ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ చెడును విడనాడి, మంచిని ఆచరిస్తూ సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ పర్వదినం ప్రజలందరిలో నూతన ఉత్సాహాన్ని, సానుకూల ఆలోచనలను నింపాలని ఆకాంక్షించారు. సమాజంలో ప్రేమాభిమానాలు, ఐక్యత, సోదరభావం మరింత బలపడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పండుగ జిల్లా ప్రజలందరి జీవితాల్లో అన్ని రంగాల్లో విజయాన్ని చేకూర్చాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో వెల్లివిరియాలని దుర్గామాతను ప్రార్థించారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకోవాలని కోరారు.

ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు

- శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి
-నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పిలుపు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 19:



విజయదశమి పండుగను పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా ప్రజలందరికీ పోలీస్ కమిషనర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీస్ శాఖ తరఫున ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దుష్టశక్తులపై సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకునే ఈ పండుగ స్ఫూర్తితో ప్రజలందరూ ఐక్యత, సమగ్రతల కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. జిల్లాలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, మతసామరస్యానికి తావు ఇవ్వకుండా ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు, పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ స్నేహపూర్వక వాతావరణంలో, సోదర భావంతో మెలగాలని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



ప్రమాదం జరిగితే కానీ పట్టించుకోరా?

- ప్రమాదకరంగా వేలాడుతున్న భారీ హోర్డింగ్ ఫ్లెక్సీ
- అనుమతులు ఉన్నాయా..?
పట్టించుకోని అధికారులు

మహేశ్వరం, అక్టోబరు 19 (ప్రజా కలం ప్రతినిధి)

మహేశ్వరం పట్టణ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన భారీ యూనిపోల్ హోర్డింగ్ ప్రమాదకరంగా మారింది. హోర్డింగ్‌కు అమర్చిన ఫ్లెక్సీ కింది భాగం చిరిగిపోవడంతో సగం వేలాడుతూ గాలికి ఊగుతోంది. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులు ఆందోళనకు గురవుతున్నారు. ఏ క్షణంలోనైనా ఫ్లెక్సీ రోడ్డుపై పడే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రధాన రహదారిలో ‘రిడ్జ్ ట్రాంక్విల్ వ్యాలీ’ పేరుతో 16 ఎకరాల హెచ్ఎండీఏ విల్లా ప్లాట్ల ప్రకటన కోసం ఈ భారీ హోర్డింగ్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఫ్లెక్సీ చిరిగిపోయి





రోజులుగా ప్రమాదకరంగా వేలాడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు ఉన్నాయా..?

ప్రధాన రహదారులపై భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలంటే సంబంధిత నిబంధనల ప్రకారం అనుమతులు, భద్రతా ప్రమాణాలు పాటించాల్సి ఉంటుంది. అయితే సదరు హోర్డింగ్‌కు అనుమతులు ఉన్నాయా? హోర్డింగ్ నిర్మాణం, ఫ్లెక్సీ ఏర్పాటు విషయంలో భద్రతా ప్రమాణాలు పాటించారా? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. హోర్డింగ్ నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తోందని వారు అంటున్నారు.

గతంలో నగరంలో భారీ హోర్డింగ్‌లు కూలి ప్రమాదాలు చోటుచేసుకున్న ఘటనలు ఉన్న నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రాణనష్టం జరిగిన తర్వాత స్పందించే పరిస్థితి రాకముందే ప్రమాదకరంగా వేలాడుతున్న ఫ్లెక్సీని వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి హోర్డింగ్‌కు అనుమతులు ఉన్నాయా లేదా అన్నది తేల్చాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు. అక్రమ, ప్రమాదకర హోర్డింగ్‌లపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని సిరిగిరిపురం గ్రామపంచాయతీ అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

ఆపదలో అండగా మానవసేవే మాధవసేవ సభ్యులు

నరేందర్ అంత్యక్రియలకు 15 మంది సభ్యుల ఆర్థిక సహాయం

మల్కాజిగిరి, అక్టోబరు 19 (ప్రజా కలం ప్రతినిధి): ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని చాటుతూ మానవసేవే మాధవసేవ గ్రూప్ సభ్యులు ఉదారతను చాటుకున్నారు. మీర్జాలగూడకు చెందిన ఏ. నరేందర్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందగా, ఆయన అంత్యక్రియల నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి 15 మంది సభ్యులు కలిసి రూ. 10,010 ఆర్థిక సహాయం అందించారు.

మల్కాజిగిరి నియోజకవర్గంలోని మీర్జాలగూడ డివిజన్‌కు చెందిన నరేందర్ అనారోగ్యంతో బాధపడుతూ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని స్థానిక సామాజిక కార్యకర్త, మానవసేవే మాధవసేవ సభ్యుడు జంగాల శ్రీరామ్ యాదవ్ గ్రూప్ నిర్వాహకుడు కుమ్మరి రాజు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన కుమ్మరి రాజు గ్రూప్ సభ్యులతో చర్చించి బాధిత కుటుంబానికి సహాయం అందించాలని కోరారు.

ఈ క్రమంలో జగన్, కుమ్మరి రాజు, చిరంజీవి, అహ్మద్ అలీ ఖాన్, ప్రవీణ్, బలరాజ్, కృష్ణ, ప్రభాకర్, రషీద్, తుపాకుల రమేష్, మహేష్, శ్రీధర్, భాస్కర్, ఉదారి లక్ష్మణ్ యాదవ్, రిషి కుమార్ రెడ్డి తదితర 15 మంది సభ్యులు తమ వంతు ఆర్థిక సహకారాన్ని అందించారు. సభ్యుల నుంచి సేకరించిన రూ. 10,010 నగదును మానవసేవే మాధవసేవ అధ్యక్షుడు కుమ్మరి రాజు, ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ రషీద్ నరేందర్ అంత్యక్రియల నిర్వహణ కోసం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ యాదవ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు సహాయం అందించి వారికి మనోధైర్యాన్ని కల్పించడం తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని గ్రూప్ సభ్యులు తెలిపారు. ఆపద సమయంలో స్పందించి మానవత్వాన్ని చాటుకున్న మానవసేవే మాధవసేవ సభ్యుల సేవాభావాన్ని స్థానికులు అభినందించారు.









మహంకాళి ఆలయంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

అమ్మవారిని దర్శించుకున్న టీవైఆర్ ఫౌండేషన్ చైర్మన్ టీ.రాజు

గజ్వేల్, అక్టోబర్ 19 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్ పట్టణంలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం టీవైఆర్ ఫౌండేషన్ చైర్మన్ టీ.రాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నంద బాల శర్మ అమ్మవారి శాననంతో టీ.రాజును సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,మహిమలు కలిగిన మహంకాళి అమ్మవారి ఆలయంలో ప్రతి సంవత్సరం శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. అమ్మవారి అనుగ్రహంతో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకునే భక్తులందరిపై జగన్మాత కృప ఎల్లప్పుడూ ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర

స్మారక దినోత్సవం

హైదరాబాద్, అక్టోబరు 18 (ప్రజాకలం): దేశ సమైక్యత, శాంతి, అహింస కోసం కృషి చేసిన మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని చార్మినార్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రంగారెడ్డి



జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొని రాజీవ్‌గాంధీకి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, తెలంగాణ ఏఐసీసీ కో–ఆర్డినేటర్ సచిన్ సావంత్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి వెంట పారిజాత నర్సింహారెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉందన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు ప్రజా సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

పెరేడు భూములపై సమగ్ర విచారణ జరపాలి

ఎంపీడీఓ తహసీల్దార్‌కు సర్పంచ్ నవీన్ వినతి



మహేశ్వరం, అక్టోబరు 19 (ప్రజాకలం): మహేశ్వరం గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్లు 1/పెరేడు, 2/పెరేడు భూములపై సమగ్ర విచారణ చేపట్టి భూమి స్వభావం, హద్దులను నిర్ధారించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ ఎంపీడీఓ శారదమ్మ, తహసీల్దార్ చిన్న అప్పలనాయుడుకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. సదరు భూములు పట్టా భూములా, పెరేడు భూములా, గ్రామకంఠం భూములా అన్న విషయాన్ని అధికారిక రెవెన్యూ రికార్డుల ఆధారంగా స్పష్టంగా నిర్ధారించాలని సర్పంచ్ కోరారు. భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. పాత రెవెన్యూ, సర్వే రికార్డులు, పటాలు, ఇతర సంబంధిత పత్రాలను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలన్నారు.

భూములకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి అధికారిక నివేదిక ఇవ్వడంతోపాటు ఖచ్చితమైన హద్దులను గుర్తించి సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. నక్షా పటం (సర్వే స్కెచ్)తో కూడిన నివేదిక అందించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామపంచాయతీ పరిధిలోని భూముల పరిరక్షణ, ప్రభుత్వ భూముల గుర్తింపు, ప్రజా ఆస్తుల సంరక్షణ, భూ వివాదాల నివారణకు విచారణ అవసరమని నవీన్ పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఉపసర్పంచ్ జొరాల రమేష్, వార్డు సభ్యులు ఆకుల వీరిబాబు, నాయకులు కాడమోని ప్రభాకర్, సున్నం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న బీఆర్ఎస్ నాయకులు

- పాములపర్తిలో అంగరంగ వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



గజ్వేల్ నియోజకవర్గం, అక్టోబర్ 19 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ నియోజకవర్గం మర్కుక్ మండలం పాములపర్తి గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి.

ఈ సందర్భంగా సోమవారం దుర్గామాత అమ్మవారిని పలువురు బీఆర్ఎస్ నాయకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.మాజీ ఎంపీపీ పాండు గౌడ్,మాజీ వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి,మాజీ జెడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం, గ్రామ సర్పంచ్ భవాని బాలకిషన్,బీఆర్ఎస్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్,ఉప సర్పంచ్ జుట్టు సుధాకర్ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని,అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఈ సందర్భంగా ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో పురోహితులు దేశాయి కార్తీక్ శర్మ,బీఆర్ఎస్ నాయకులు బేతి నరేందర్ రెడ్డి,పిట్ల మహేష్,వార్డు సభ్యుడు మ్యాకల శ్రీనివాస్,దుర్గేష్, శరావళి మాత ఉత్సవ సేవా సమితి సభ్యులు బేతి భాను ప్రకాష్ రెడ్డి, ముమ్మడి దొడ్డాచారి, గాంధాల వెంకటేష్,బక్క శంకర్, వల్లకాటి నాగశేఖర్,లింగ చారి,స్వామి రెడ్డి,శ్రీనివాస్,కిరణ్, సందీప్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

మహేశ్వరంలో తృటిలో తప్పిన పెను ప్రమాదం

శివగంగ ఆలయ కోనేరులోకి దూసుకెళ్లిన ఇన్నోవా కారు

అతివేగం, నిద్రమత్తు కారణం ప్రాణాలతో బయటపడిన డ్రైవర్ బొడ్డుపల్లి కుమార్



మహేశ్వరం, అక్టోబర్ 19 (ప్రజా కలం):

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి పెను ప్రమాదం తృటిలో తప్పింది. పట్టణంలోని అత్యంత పురాతనమైన, ప్రసిద్ధమైన శ్రీ శివగంగ రాజరాజేశ్వరి స్వామి దేవస్థానం కోనేరులోకి ఓ ఇన్నోవా కారు అదుపుతప్పి దూసుకెళ్లింది. ఈ ఘటనతో ఆలయ పరిసరాల్లో ఒక్కసారిగా కలకలం రేపింది.

ఘటన వివరాలు:

సరూర్ నగర్ కొత్తపేటకు చెందిన బొడ్డుపల్లి కుమార్ (32) అనే వ్యక్తి శనివారం అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో మహేశ్వరం మీదుగా వెళ్తున్నాడు. ఆలయ కోనేరు సమీపంలోని మలుపు వద్దకు రాగానే తీవ్ర నిద్రమత్తులోకి జారుకోవడం, అతివేగంగా ఉండటంతో కారు అదుపు తప్పింది. రోడ్డు పక్కన ఉన్న కట్టను ఢీకొని పల్టీలు కొడుతూ నేరుగా కోనేరులోకి దూసుకెళ్లి నీట మునిగిపోయింది. పెద్ద శబ్దం రావడంతో చుట్టుపక్కల ఉన్న స్థానికులు, ఆలయ కాపలాదారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. నీట మునిగిన కారులో నుండి డ్రైవర్ కుమార్ స్వయంగా బయటకు రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అతనికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మహేశ్వరం పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్రేన్ సహాయంతో కారును బయటకు తీసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

పోలీసుల హెచ్చరిక:

ఈ సందర్భంగా మహేశ్వరం పోలీసులు మాట్లాడుతూ, రాత్రి వేళల్లో సుదూర ప్రయాణాలు చేసే వారు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. నిద్రమత్తులో, అలసటతో వాహనాలు నడపడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, అలసట అనిపించినప్పుడు వాహనాన్ని సురక్షిత ప్రాంతంలో నిలిపి, కాసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాతే ప్రయాణం కొనసాగించాలని సూచించారు.



మార్కెట్ యార్డు షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

- పీఏసీఎస్ చైర్మన్ పాక మల్లేశ్ యాదవ్

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 19 (ప్రజా కలం)

మండలంలోని ఇంద్రియాల గ్రామ మార్కెట్ యార్డులో అంజుమన్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్మించనున్న షెడ్డు నిర్మాణ పనులకు పోచంపల్లి మండల పీఏసీఎస్ చైర్మన్ పాక మల్లేశ్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జూలూరు పీఏసీఎస్ చైర్మన్ కళ్లెం రాఘవరెడ్డి, పోచంపల్లి వైస్ చైర్మన్ కొట్టం కరుణాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేశ్ యాదవ్, యాదాద్రి భువనగిరి జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు మర్రి నర్సింహారెడ్డి, జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, ఇంద్రియాల పీఏసీఎస్ డైరెక్టర్ పావిరాల లింగమ్మ, శివారెడ్డిగూడెం పీఏసీఎస్ డైరెక్టర్ వారాల రామచంద్రారెడ్డి, ఇంద్రియాల కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పానుగంటి లింగస్వామి, వార్డు సభ్యులు దొడ్డి సుధాకర్, బర్మావత్ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బద్దం నర్సింహ, పావిరాల మహేందర్, బద్దం రాజేశ్వర్, ఎర్ర మహేందర్, మేకల భూపాల్ రెడ్డి, పావిరాల దయాకర్, బద్దం రాజు, బోయిని లింగస్వామి, మొగిలిపాక ప్రవీణ్, పబ్బు యాదయ్య, మేకల మల్లారెడ్డి, ఒంగేటి దయాకర్ రెడ్డి, శనిగారం చంద్రయ్య, మొగిలిపాక శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



సూరత్ లో తెలంగాణ వైభవశాలి బతుకమ్మ సంబురాలు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 19:

బాలాజి నగర్ (జి.ఎచ్.బి) అసోసియేషన్, సిద్ధి వినాయక మందిర కమిటీ, పద్మశాలీ సమాజం, కల్పన ప్రియాంక టౌన్ కైలాస్ నగర్ సూరత్ వారి ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో స్థానిక తెలంగాణ మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చారు. వాటి చుట్టూ తిరుగుతూ సాంప్రదాయ పాటలు పాడుతూ సంబురాలు జరిపారు. మరి ముఖ్యంగా తెలుగు మరియు గుజరాతి భాషల్లోని పాటలపై నారిమనులు డ్యాన్స్ చేశారు. ఐతే తన కర్మభూమి రాష్ట్రమైన గుజరాత్ సూరత్ లో తమ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాన్ని ఎలుగెత్తి చాటుతున్న మహిళా లోకానికి నిర్వాహకులు అభినందించారు. ఈ కార్యక్రమానికి "తెలంగాణ వలస ప్రజల జె.ఏ.సి" ప్రతినిధి గోడీతాల లక్ష్మిపతి, సూరత్ పద్మ శాలి జనరల్ సమాజం అధ్యక్షుడు కోధునూరి శ్రీనివాస్, కార్యదర్శి తుమ్మ రమేష్, 25వ వార్డు కార్పొరేటర్లు సి.జయేష్, ఎనగందుల కవిత, సంజయ్ భాయ్, సుష్మా పాటిల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మరోవైపు స్థానిక ప్రముఖులు అంబటి సత్యంరావు, రుద్ర మనోహర్, మోహనరావు, రుద్ర రవికుమార్, దూడం శివగణేష్, ఆడెపు వెంకన్న, చెన్న రమేష్, కొంగ భిక్షపతి, ఎనగందుల కర్ణాకర్, దాసరి వీరన్న లతోపాటు మహిళ ప్రతినిధులైన అంబటి పద్మ, వెంకటమ్మ, నిర్మల, సామల ఝాన్సీ, తుమ్మ పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

13 మంది డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు పట్టాల పంపిణీ.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 19.

మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన 13 మంది డబుల్



బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల స్వామి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గణేష్ పంచమి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పేదల సంక్షేమం, జీవన ప్రమాణాల మెరుగుదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. పట్టాలు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మహమ్మద్ జహీరోద్దీన్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు డాకోల్ల ఆంజనేయులు గౌడ్, కోనాపూర్ ఉపసర్పంచ్ పంచమి రాజు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బాల శేఖర్ రెడ్డి, అల్వాల స్వామి తదితరులు పాల్గొన్నారు.
















భారతీనగర్‌లో నవరాత్రి సందడి

భారతీనగర్‌లో 19 అమ్మవారి మండపాల్లో కృష్ణమూర్తి పూజలు..

అన్నప్రసాదాలకు సహకారం..

పటాన్‌చెరు, అక్టోబర్ 19 (ప్రజా కలం) ప్రతినిధి భారతీనగర్ డివిజన్‌లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో,ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నాయి. దసరా నవరాత్రుల సందర్భంగా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలు భక్తులతో సందడిగా మారాయి. ఈ క్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా క్రీడా విభాగం కన్వీనర్ కంజర్ల కృష్ణమూర్తి డివిజన్ పరిధిలో నిర్వహించిన సుమారు 19 దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి అలంకరణ, అన్నప్రసాదాల పంపిణీ కోసం ఆర్థిక సహకారం అందించారు. భక్తి, సేవాభావంతో నిర్వహించే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, భారతదేశం సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో సునంద కృష్ణమూర్తి, రాజేందర్ చారి, సాయి, వెంకట హర్ష తదితరులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు..





Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,Telangana -503001
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com